ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -114 | పేజీలు - 8 | వెల - 03/- | మంగళవారం 11 ఆగస్టు 2026




## ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**ఈసారి కూడా వైసీపీ గైర్హాజరు?**

**ఆగస్ట్ 17 నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు**

**ప్రతిపక్ష హోదా ఇవ్వనందున అసెంబ్లీకి దూరంగా ఉండనున్న వైసీపీ**

**శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరుకానున్న విపక్షం**

**మండలిలో మెగా డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వ్యూహం**

**హైకోర్టులో విచారణలో ప్రతిపక్ష హోదా అంశం**

**అమరావతిఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్ట్ 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ప్రతిపక్ష హోదా వివాదం**మిగతా 2లో...**

# కబ్జాదారుల పెత్తనానికి చరమగీతం

**కైకలూరులో భూ హక్కు పత్రాలు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు**





**వైసీపీ ఒక గొడ్డలి పార్టీ అని, రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తోందని తీవ్ర విమర్శ**

**గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ఉపేక్షించేది లేదని, పోలీసులపై దాడులు సహించబోమని హెచ్చరిక**

**ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్ అందిస్తామని, 10 ఎకరాల నిబంధన రద్దు చేశామని ప్రకటన**

**ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలకు, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు శాశ్వతంగా చరమగీతం పాడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తుంటే, ప్రతిపక్ష వైసీపీ మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. **మిగతా 2లో...**

## పార్లమెంట్ లో ప్రతిపక్షాల ఆందోళన

**అమిత్ షా సభకు రావాలి**

**విద్యార్థులపై పోలీసుల దాడి పట్ల ప్రకటన చేయాలి**

**రాజ్యసభలో సభ్యుల వాకౌట్**

**ఉభయసభల్లో చెరో బిల్లు ఆమోదం**

**లోక్‌సభలో నాలుగు బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్రం**



**-న్యూఢిల్లీ ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని, విద్యార్థులపై పోలీసుల దాడి పట్ల ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు, కేంద్ర బలగాల దాడి, అయోధ్య రామమందిరం విరాళాల చోరీకి వ్యతిరేకంగా సోమవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. రాజ్యసభలో విపక్షాలు వాకౌట్ చేశాయి. లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ ప్రేమచంద్రన్ ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించగా ప్రతిపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు హోరెత్తించారు. జులై 20న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ గురించి వివరణ ఇవ్వాలని, కేంద్ర మంత్రి అమిత్ షా సభకు రావాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సభ సమావేశమైన కొన్ని సెకన్లలోనే మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు. **మిగతా 2లో...**



2లో.

## తమిళ గీతానికే తొలి ప్రాధాన్యం

: కేంద్రం ఆదేశాలపై విజయ్ ప్రభుత్వం సంచలన తీర్మానం

ఇకపై మొదట రాష్ట్ర గీతం 'తమిళ తాయ్ వాళ్తు'నే ఆలపించాలి

అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిన ప్రభుత్వం

తొలి స్థానం ఇవ్వడం తమ హక్కు అని స్పష్టం చేసిన సీఎం విజయ్

## తెలంగాణలో ముగిసిన సర్

**రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు**

**హైదరాబాద్, ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. **మిగతా 2లో...**



## కూటమికి నష్టం చేయొద్దు



**బాలినేని, దామచర్ల రగడపై టీడీపీ, జనసేన నాయకత్వాలు సీరియస్**

**ఒంగోలులో బాలినేని, దామచర్ల మధ్య తీవ్రమైన మాటల యుద్ధం**

**తీవ్రంగా స్పందించిన టీడీపీ, జనసేన అధిష్టానాలు**

**ఇద్దరు నేతలకు ఫోన్లు చేసి సంయమనం పాటించాలని సూచన**

**పరిస్థితిని సమీక్షించిన కూటమి సమన్వయ కమిటీ**

**ఒంగోలు ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** ఒంగోలు వేదికగా జనసేన నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మధ్య చోటుచేసుకుంటున్న మాటల యుద్ధంపై టీడీపీ, జనసేన పార్టీల అధిష్ఠానాలు తీవ్రంగా స్పందించాయి. **మిగతా 2లో...**

## దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

గోవింద నామాలను పేరడీ చేయడంపై పవన్ కల్యాణ్ ఆగ్రహం

నెల్లూరులో ఓ పార్టీ చర్యను తీవ్రంగా ఖండించిన జనసేనాని

భక్తుల మనోభావాలను కించపరిచే కుట్రపూరిత చర్యగా అభివర్ణన

ఈ ఘటనపై చట్టపరంగా ముందుకెళ్లాలని పార్టీ నేతలకు ఆదేశం

దైవ నామాలను అపహాస్యం కోసం వాడొద్దని హితవు

**అమరావతిఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఓ ఘటనను ఆయన ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ, తమ కార్యక్రమాల్లో **మిగతా 2లో...**



## పొగాకు రైతులకు ప్రభుత్వం అండ

**వడ్డీలేని రుణంగా 50 వేల చొప్పన అందిస్తాం**

**పొగాకు సాగు 80 మిలియన్ కిలోలకు కట్టడి చేయాలని నిర్ణయం**

**టొబాకో బోర్డు కార్యాలయంలో సమీక్షలో మంత్రి అచ్చన్నాయుడు**



**గుంటూరు, ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** పొగాకు రైతులకు ఒక్కొక్కరికి రూ.50 వేలను వడ్డీ లేకుండా రుణం రూపంలో అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. రెండేళ్ల పాటు వడ్డీ లేకుండా రూ.50వేలు ఇస్తామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తరపున క్వింటాలుకు రూ.1000లను అందజేస్తామని తెలిపారు. పొగాకు కొన్న 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వచ్చే ఏడాది పొగాకు సాగు 80 మిలియన్ **2లో...**



## సమృద్ధిగా వర్షాలు కురవాలని.. సీఎం రేవంత్‌రెడ్డి మహావరుణయాగం

2లో.

**సతీసమేతంగా సాగర్‌లో పూజలు**

**అన్ని ప్రాజెక్టులు, చెరువులూ జలకళతో ఉండాలని ప్రార్థనలు**

**108 మంది వేద పండితులతో.. 11 హోమగుండాలు**

# కబ్జాదారుల పెత్తనానికి చరమగీతం

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో నిర్వహించిన భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు.

**భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం**

ప్రతి నెల 9వ తేదీన భూ సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించి, నేరుగా ప్రజల వద్దకే వచ్చి పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఇప్పటివరకు 7,450 గ్రామాల్లో 32 లక్షల మందికి పైగా రైతులకు అత్యాధునిక భద్రతా ఫీచర్లతో, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు అందించామని వెల్లడించారు. గత ప్రభుత్వం తమకు ఇష్టం లేని వారి భూములను 22-ఏ జాబితాలో చేర్చి, వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు.

తమ ప్రభుత్వం ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 41 వేల ఎకరాలను 22-ఏ నుంచి విముక్తి చేసి 25 వేల మంది రైతులకు న్యాయం చేసిందని తెలిపారు. కైకలూరులోనే సుమారు 2,838 ఎకరాలను 1,848 మంది రైతులకు అప్పగించామని చెప్పారు. "మీ భూమిపై మీకే హక్కు ఉండాలి. వేరేవాళ్ల పెత్తనం గానీ, వారి ఫొటోలు గానీ ఉండటానికి వీల్లేదు. ఈ సమస్యను పరిష్కరించే వరకు నేను నిద్రపోను," అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**గొడ్డలి పార్టీపై నిప్పులు**

గతంలో తాను నక్సలిజం, ఫ్యాక్షనిజం, మత ఘర్షణలను ఉక్కుపాదంతో అణచివేశానని గుర్తుచేసిన చంద్రబాబు, ఇప్పుడు రాష్ట్రానికి "గొడ్డలి పార్టీ" రూపంలో కొత్త ముప్పు వచ్చిందని అన్నారు. "నా 48 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి దౌర్భాగ్యపు పార్టీని చూడలేదు. బాబాయ్‌ను గొడ్డలితో నరికి చంపి, ఆ నెపాన్ని నాపై వేయాలని చూశారు. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ నాపైనే కథనాలు రాయించారు. నేను రౌడీలకు సింహస్వప్నం కానీ, నేను రౌడీయిజం చేయను. హత్య చేసినవాడు కూడా అదే విధంగా పోతాడనేది నా సిద్ధాంతం" అని ఉద్వేగంగా ప్రసంగించారు.

గత ఐదేళ్లలో గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లు పెట్రేగిపోయాయని, ఇప్పుడు కూడా పోలీసులపై దాడులు చేస్తూ, రోడ్లపై విన్యాసాలు చేస్తూ శాంతిభద్రతలకు సవాల్ విసురుతున్నారని మండిపడ్డారు. శ్రీకాకుళంలో బందోబస్తుకు వెళ్లిన ఒక మహిళా పోలీస్ అధికారిణిపై వైసీపీ శ్రేణులు దాడి చేసి, అసభ్యంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. "ప్రజలను కాపాడే పోలీసులకే రక్షణ లేకపోతే, రాష్ట్రంలోని ఆడబిడ్డల పరిస్థితి ఏంటి? ఇలాంటి అరాచకాలను చూస్తూ ఊరుకోవాలా?" అని ప్రశ్నించారు.

మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని అభినందించాల్సింది పోయి, నీట్ కుంభకోణంతో ముడిపెట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని, దీనికి నిరసనగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులే రోడ్లపైకి వచ్చి వైసీపీకి బుద్ధి చెప్పడం శుభపరిణామమని అన్నారు.

**అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా**

ఎన్డీయే ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్‌గా సూపర్ స్పీడ్‌తో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ఆక్వా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం, జోన్, నాన్-జోన్, 10 ఎకరాల పరిమితి అనే తేడా లేకుండా అందరికీ యూనిట్ కరెంటును రూ.1.50కే అందిస్తామని, దీనికోసం రూ.1150 కోట్లు ఖర్చయినా వెనుకాడబోమని ప్రకటించారు. కైకలూరు నియోజకవర్గ తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.36 కోట్లు మంజూరు చేశామని, వీలైనంత త్వరగా సిమెంట్ రోడ్లు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

**అధికారులకు జవాబుదారీతనం**

సభా వేదికపైనే వివిధ శాఖల అధికారుల పనితీరును ఐవీఆర్ఎస్ డేటా ఆధారంగా సమీక్షించడం ద్వారా పాలనలో పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. బాగా పనిచేసిన వారిని అభినందించి, వెనుకబడిన వారిని హెచ్చరించారు. "నేను కష్టపడుతున్నాను, మీరు కూడా కష్టపడాలి. ప్రజలకు సేవ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు" అని అధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు.

చివరగా, "ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పేరుతో '...అనే నేను' అంటూ దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి పునరంకితమవుతామని సంకల్పం తీసుకోవాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కూటమికి నష్టం చేయొద్దు

**మొదటిపేజీ తరువాయి**

నేతలిద్దరూ సంయమనం పాటించాలని, బహిరంగ విమర్శలకు దూరంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. ఈ వ్యవహారం కూటమి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని భావించిన ఇరు పార్టీల అగ్రనేతలు తక్షణమే రంగంలోకి దిగారు. ఈ పరిణామాలపై కూటమి సమన్వయ కమిటీ సభ్యులు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశంలో టీడీపీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలుంటే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలి తప్ప, బహిరంగ విమర్శలకు దిగడం కూటమి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో నేరుగా మాట్లాడారు. సంయమనం పాటించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. అటు జనసేన నేతలు కూడా బాలినేనితో మాట్లాడారు. ఒంగోలు నియోజకవర్గంలో భూములు, ఇసుక, రేషన్ పంపిణీలో జరుగుతున్న అక్రమాల్లో ఎమ్మెల్యేకు భాగస్వామ్యం ఉందని, దీనిపై విచారణ జరిపించాలని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శలపై దామచర్ల జనార్ధన్ ధీటుగా స్పందిస్తూ, బాలినేని నియోజకవర్గానికి అప్పుడప్పుడు మాత్రమే వస్తుంటారని, గతంలో టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించారని, ఇప్పటికీ కూటమి ప్రయోజనాలకు వ్యతిరేకంగా, వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రకాశం జిల్లాలో ఈ అంతర్గత విభేదాలు కూటమికి రాజకీయంగా నష్టం చేకూర్చకూడదనే ఉద్దేశంతోనే ఇరు పార్టీల అధిష్ఠానాలు సత్వరమే జోక్యం చేసుకున్నాయి.

# తమిళ గీతానికే తొలి ప్రాధాన్యం

**: కేంద్రం ఆదేశాలపై విజయ్ ప్రభుత్వం సంచలన తీర్మానం**

తమిళనాడులోని అన్ని అధికారిక కార్యక్రమాల్లో ఇకపై రాష్ట్ర గీతం 'తమిళ తాయ్ వాళ్తు'కే ప్రథమ ప్రాధాన్యం లభించనుంది. కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ సోమవారం తమిళనాడు శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. రాష్ట్రంలోని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు దీనికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ వాయిస్ ఓటు ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, తమిళ భాష తమ రాష్ట్రానికి ప్రాణనాడి, భావోద్వేగం, అస్తిత్వమని అభివర్ణించారు. "తమిళం మన గర్వం, తమిళం మన శక్తి. 'తమిళం' అన్న పదం యావత్ తమిళనాడును ఏకతాటిపైకి తెస్తుంది. తమిళ తాయ్ వాళ్తుకు రాష్ట్రంలో ప్రథమ స్థానం ఉండాలి, దానికి అగ్రపీఠం వేయడం మా హక్కు" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర భాషా, సాంస్కృతిక హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, తమిళ భాషాభిమానం దేశభక్తి పరస్పర విరుద్ధం కావని ఆయన పేర్కొన్నారు. అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతానికి ముందు జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇటీవల ఒక సూచన చేసింది. రాష్ట్ర గీతంతో పాటు జాతీయ గీతం లేదా గేయం ఆలపించాల్సి వస్తే, జాతీయ గేయానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర సాంస్కృతిక మూలాలను పరిరక్షించేందుకు ఈ తీర్మానం చేశామని, ఇది రాజ్యాంగం కల్పించిన భాషా, సాంస్కృతిక హక్కులకు అనుగుణంగానే ఉందని ప్రభుత్వం వివరించింది. ఈ నూతన తీర్మానంతో, కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతం, ముగింపులో జాతీయ గీతం ఆలపించే సంప్రదాయం ఇకపై చట్టబద్ధంగా అమలుకానుంది.

# పొగాకు రైతులకు ప్రభుత్వం అండ

**మొదటిపేజీ తరువాయి**

కిలోలకు కట్టడి చేయాలని నిర్ణయించామని అన్నారు. దీన్ని కూడా రాజకీయం చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా పని చేసిన గొడ్డలి పార్టీ అధినేత లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహించారు. గుంటూరు జిల్లాలోని టొబాకో బోర్డు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పొగాకు రైతుల సమస్యలు, ధరలు, కొనుగోళ్ల తీరుపై చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయులు, ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, టొబాకో బోర్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి హయాంలో పొగాకు ధరలు తగ్గినా, చేసిందేమీ లేదని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. జగన్ హయాంలో కేవలం 11 మిలియన్ కిలోలు మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా కొన్నారని ప్రస్తావించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే పొగాకు రైతులకు మేలు జరిగిందని తెలిపారు. రైతులు ఈ విషయం గుర్తించాలని.. వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. పొగాకు నాణ్యత నిర్ధారణ కోసం ఐదుగురు సభ్యుల కమిటీ వేశామని వెల్లడించారు. గ్రేడ్ తక్కువని చెప్పి వ్యాపారులు ఇష్టారాజ్యంగా చేసేందుకు వీల్లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని..

# సీఎం రేవంత్‌రెడ్డి మహావరుణయాగం

**సతీసమేతంగా సాగర్‌లో పూజలు**



**నల్లగొండ/నాగార్జునసాగర్ ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురవాలని, కృష్ణాగోదావరి పరీవాహక ప్రాంతాలు జలకళను సంతరించుకోవాలని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. కృష్ణా నది తీరంలోని విజయ్ విహార్ పర్యాటక అతిథి గృహ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో తెల్లవారుజామున నాలుగు గంటలకు యాగం ప్రారంభమైంది. ఆ తర్వాత మధ్యాహ్నం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సతీసమేతంగా పూర్ణాహుతి సమర్పించడంతో యాగం ముగిసింది. ఈ యాగంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు.

**108 మంది వేద పండితులతో..11 హోమగుండాలు**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అర్చకులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం యాగాన్ని నిర్వహించారు. యాదగిరిగుట్టతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు చెందిన 108 మంది వేద పండితులు, రుత్వికులు, అర్చకులు యాగ క్రతువులో పాల్గొన్నారు. ఇందుకోసం 11 ప్రత్యేక హోమగుండాలను ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు మంత్రోచ్ఛారణలు, సంకల్పంతో ప్రారంభమైన యాగంలో వరుణ జపాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సాగర్‌కు సీఎం.. పూర్ణాహుతి సమర్పణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.45 గంటలకు నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బీసీ రెసిడెన్షియల్ స్కూల్ హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దంపతులకు యాగశాల వద్దకు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. యాగ ప్రాంగణానికి చేరుకున్న సీఎం దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిర్ణయించిన శుభ ముహూర్తం ప్రకారం సాయంత్రం 3.20 నుంచి 3.24 గంటల మధ్య వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ హోమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాక్రతువు ఏర్పాట్లను నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.

# తెలంగాణలో ముగిసిన సర్

**మొదటిపేజీ తరువాయి**

దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

-------------

# ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి**

నేపథ్యంలో ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

నోటిఫికేషన్ ప్రకారం, ఆగస్ట్ 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమైన వైసీపీకి ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ కు ఎల్ఓపీ హోదా కల్పించనంత వరకు అసెంబ్లీకి హాజరయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రజల గొంతుకను బలంగా వినిపించాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోవడం వారి అవివేకమే అవుతుందని జగన్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ హోదాకు సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది. అయితే, అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని వైసీపీ నిర్ణయించింది. మండలిలో తమకు పూర్తి మెజారిటీ ఉండటంతో, వివిధ ప్రజా సమస్యలపై ఎన్డీఏ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా, మెగా డీఎస్సీ-2025లో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలపై మండలిలో గళం విప్పనుంది. ఈ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని, పారదర్శక దర్యాప్తు కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. అయితే, తాము డీఎస్సీ పరీక్షను రద్దు చేయాలని గానీ, ఇప్పటికే నియామకమైన అభ్యర్థులను తొలగించాలని గానీ కోరడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. దీంతో ఈ వర్షాకాల సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది.

# పార్లమెంట్ లో ప్రతిపక్షాల ఆందోళన

**మొదటిపేజీ తరువాయి**

తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే నాలుగు బిల్లులను ప్రవేశపెట్టారు. న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లును, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్మెంట్ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. గనులు, ఖనిజాల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్ష ఎంపీలు వ్యతిరేకించారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కేరళం పేరు మార్పు బిల్లును హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్, నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సవరణ బిల్లును మంత్రి మురళీధర్ మోహల్ ప్రవేశపెట్టారు. అనంతరం సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. దీంతో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ఎటువంటి చర్చ లేకుండానే ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చర్చకు సిద్ధంగా ఉన్నారని, ప్రతిపక్షాలు సభ సజావుగా సాగేందుకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. దీనికి ప్రతిపక్ష ఎంపీ కె.సి వేణుగోపాల్ స్పందిస్తూ చర్చకంటే ముందు విద్యార్థులపై క్రూరమైన దాడి గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభను నేటి(మంగళవారం)కి వాయిదా వేశారు. సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి లోక్‌సభ కార్యక్రమాలు ప్రతి రోజూ వాయిదాపడుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది బిల్లులు ప్రవేశపెట్టగా ఆరు బిల్లులు ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ "దాదాపు 20 రోజులు గడిచినా సమాధానం చెప్పేందుకు అమిత్ షా పార్లమెంటుకు రాలేదు. చర్చ కోసం ప్రతిపక్షం ప్రవేశపెట్టిన ప్రతి తీర్మానాన్ని తిరస్కరించారు. ఆయన మౌనం పొరపాటు కాదు.. అది హింసకు ఆమోదం తెలపడమే. ఆయన దోషి అయినా అయి ఉండాలి లేదా అసమర్థుడైనా అయి ఉండాలి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని మేము డిమాండ్ చేస్తున్నాం. ఆయనను జవాబుదారీగా నిలబెట్టే వరకు మా పోరాటం ఆగదు" అని అన్నారు.

**రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్**

మరోవైపు రాజ్యసభలో కూడా అదే పరిస్థితి నెలకొంది. సభను ప్రారంభించిన వెంటనే ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. రామ మందిర విరాళాల చోరీపై ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. రామ మందిర విరాళాల చోరీ, నిరసనకారులపై పెల్లెట్ గన్‌ల వాడకం వంటి అంశాలను లేవనెత్తేందుకు ప్రయత్నించగా చైర్మెన్ అనుమతించకపోవడంతో ప్రతిపక్ష పార్టీల సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అదే సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ది బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు-2026'ను సభలో చర్చకు ప్రవేశపెట్టారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు హోరెత్తించారు. ప్రతిపక్షాల ఆందోళనతో డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ వెంటనే సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2.15 గంటలకు సభ తిరిగి సమావేశం కాగా వలసవాద కాలం నాటి చట్టం స్థానంలో కొత్త చట్టం తీసుకువచ్చే బిల్లును నిర్మలా సీతారామన్ చర్చకు పెట్టారు. అయితే ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కొన్ని అంశాలను లేవనెత్తాలని ప్రయత్నించగా, ఎంపీలు కేవలం బిల్లుపై మాత్రమే మాట్లాడాలని సభాపతి స్పష్టం చేశారు. చర్చ అనంతరం బిల్లును ఆమోదించి, సభను నేటి (మంగళవారం)కి వాయిదా వేశారు.

# దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

**మొదటిపేజీ తరువాయి**

పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా వాడుకోవడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారి తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అపహాస్యం చేయడమే కాదని, మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రపూరిత ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకన చేసే ఇలాంటి చర్యలను సహించకూడదని స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఎవరూ కూడా దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలను అపహాస్యం చేసేందుకు వినియోగించవద్దని ఆయన హితవు పలికారు. భక్తికి సంబంధించిన పవిత్రమైన విషయాలను గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# ఇకనైనా కూటమి ప్రభుత్వం మీద బురద చల్లడం మానుకోవాలి

**అన్యాయం జరిగిందని రోడ్లపైకి విద్యార్థులు, డిఎస్సీ పరీక్షలు రాసిన టీచర్లు ధర్నాలు,**

**రిలే నిరాహారదీక్షలు నిర్వహించాలి**

**కానీ రోడ్లపై గొడ్డలి పార్టీ రావడం సిగ్గుచేటు.**

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు గద్దల సామెల్.**

**పాణ్యం, ప్రతినిధి ఆగస్టు 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
డిఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు గద్దల సామెల్ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి ఓటమిపాలైన తరువాత పిచ్చి పరాకాష్టకు చేరిందని, జన్ జి పేరుతో మెగా డీఎస్సీ పై గొడ్డలి పార్టీలోని వారంతా సైకోల వ్యవహరిస్తున్నారని అన్నారు. జగన్కు చెందిన రాజకీయ పార్టీ ముసుగులో క్రిమినల్స్ తయారు చేయడం వారిని పోలీసులు అరెస్టు చేస్తే ఓదార్పు పేరుతో ప్రజలను బలి చేయడం జగన్ రెడ్డి కు అలవాటుగా మారిందని మెగా డీఎస్సీ పరీక్షలకు వెళ్లిన విద్యార్థులు ఎవరు కాకుండా వైసిపి కార్యకర్తలు ధర్నాలు చేయడం హాస్య స్పందంగా ఉందని అన్నారు. మెగా డీఎస్సీ పరీక్షలు పారదర్శకంగా జరిగాయని, ప్రతిదానికి రిజర్వేషన్ ప్రకారంగా ఉద్యోగాలు ఇచ్చామని, వాస్తవాలు చూపించినప్పటికీ, దీని తర్వాత స్పోర్ట్స్ కోటలో అక్రమాలు జరిగాయని, వైసిపి నాయకులు హైకోర్టు ఫీల్ వేసిన దానికి ప్రాథమిక ఆధారాలు చూపించకుండా, ఇటువంటి ఫిల్ వల్ల కోర్టుకు విలువైన సమయం వృధా అవుతుందని గట్టిగా మొట్టికాయలు పెట్టినప్పటికీ వీరికి సిగ్గు లేదని అన్నారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ ను రాజీనామా చెయ్యమనడం నీతి మాలిన చర్యని మండిపడ్డారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలతో బాధపడుతున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికలలో ఇచ్చిన హామీల ప్రకారం మెగా డీఎస్సీలో దాదాపు 16,350 మంది కుటుంబాలు పిల్ల పాపలతో సంతోషంగా ఉంటేమాట్లాడుతున్న జగన్ రెడ్డి వారి జీవితాలతో ఆడుకుంటున్నాడని విమర్శించారు. మెగా డీఎస్సీ మీద మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ



కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కుట్రలు చేస్తుందన్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ నారా లోకేష్ను రాజీనామా చేయాలంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రిలే నిరాహార దీక్షలు చేయడం సిగ్గుచేటు అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో ఒక డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయని అసమర్థ ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వం విమర్శించారు. మెగా డీఎస్సీ పేరుతో దాదాపు 16 వేల మందికి పోస్టులిచ్చి 16 వేల కుటు బాలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెలుగు నింపితే, అనవసరంగా వైసిపి కాంగ్రెస్ పార్టీ కోర్టులో కేసులు వేసిందన్నారు. అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గడివేముల మండలంలో మెగా డీఎస్సీలో దాదాపు 20 మంది నిరుద్యోగులు ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారని వీరంతా కూలి పనిచేసి కష్టంతో ఇష్టపడి చదివి ఉద్యోగాలను సాధించిన వారే ఉన్నారు.

# ఆళ్లగడ్డ లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ.

## మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని గంగులబ్రీజెంద్రారెడ్డి డిమాండ్

**ఆళ్లగడ్డ ఆగస్టు 10 రిపబ్లిక్ న్యూస్**
వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు డీఎస్సీ అక్రమాలు, నిరుద్యోగులకు జరిగిన అన్యాయంపై గంగుల బ్రీజెంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, యువజన విభాగం నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ ర్యాలీ, గంగుల బ్రీజెంద్రారెడ్డి రెడ్డి నివాసం నుండి ప్రారంభమై 4 రోడ్ల సెంటర్‌లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రీజెంద్రారెడ్డి, మార్కెటయార్డ్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ కులూరు నరసింహారెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు, బాబులల్,వైసీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రీజెంద్రారెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతను, నిరుద్యోగులను దారుణంగా మోసం చేసిందని మండిపడ్డారు. డీఎస్సీ నియామకాలను నిజాయితీగా



చేపట్టి ఉంటే మెరిట్ లిస్ట్ విడుదల చేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏంటని నిలదీశారు. మంత్రి నారా లోకేష్ తక్షణమే మెరిట్ లిస్ట్‌ను బహిర్గతం చేయాలని స్పోర్ట్స్ కోటాలో ఏ ప్రాతిపదికన, ఏ మెరిట్ ప్రకారం ఉద్యోగాలు కేటాయించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన ప్రతిభావంతులైన అభ్యర్థులను తాము తప్పుపట్టడం లేదని, వారికి అభినందనలు తెలియజేస్తున్నామని కానీనియామకాల్లో పారదర్శకత లేకపోవడం వల్లే నిజమైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని తాము అంటున్నామని అన్నారు . డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయాలనీ గంగుల బ్రీజెంద్రారెడ్డి డిమాండ్ చేశారు.
ఒకవైపు నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుంటూ, మరోవైపు రైతులను కూడా కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని గంగుల బ్రీజెంద్రారెడ్డి విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రైతుల అవసరాలకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారో. కూటమి ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేవలం 10 శాతం మాత్రమే పూర్తి చేయాలని దానిని అలాగే వదిలేశారని, తక్షణమే పూర్తి చేసి రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలని గంగుల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అన్ని మండలాల వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గంగుల అభిమానులు, పెద్ద సంఖ్యలో డీఎస్సీ విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఆరోగ్య నగరానికి క్రిమిసంహారక కవచం

## ప్రతిరోజూ 4 వేల లీటర్ల సోడియం హైపోక్లోరైట్ పిచికారీ -నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 10)**
నగరంలో ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలను మరింత ముమ్మరం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు క్రిమిసంహారక ద్రావణం పిచికారీని విస్తృతంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.
పాతబస్తీలోని పెద్ద మార్కెట్ వద్ద సోడియం హైపోక్లోరైట్ పిచికారీ కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ ఉచితంగా అందిస్తున్న సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని



నగరంలోని వివిధ ప్రాంతాల్లో పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సుమారు 4 వేల లీటర్ల సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేసేలా చర్యలు చేపట్టినట్లు కమిషనర్ వెల్లడించారు. ముఖ్యంగా మార్కెట్లు, రద్దీ ప్రాంతాలు, ప్రధాన రహదారులు, కాలనీలు, డ్రైనేజీ పరిసరాలు, చెత్త నిల్వ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు.
ప్రజారోగ్య పరిరక్షణలో నగరపాలక సంస్థతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంటమాలజిస్ట్ సత్యనారాయణ, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలీ లో పాల్గొన్న భూమా కిషోర్ రెడ్డి

**ఆళ్లగడ్డ ఆగస్టు 10 రిపబ్లిక్ న్యూస్**
వైయస్ఆర్‌సీపీ బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి హాజరైన వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి వైయస్ఆర్‌సీపీ నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీలో అక్రమాలకి బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని, ఫీజు రియంబర్స్ మెంట్ నిధులు వెంటనే రిలీజ్ చేసి విద్యార్థులను ఆదు కోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి.



# డీఎస్సీపై దుష్ప్రచారం తగదు

## రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్

**గుత్తి, ఆగస్టు 10: (రిపబ్లిక్ న్యూస్)**
మెగా డీఎస్సీపై ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తూ రాజకీయ డ్రామాకు తెరలేపుతున్నాయని రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్, మాజీ అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ విమర్శించారు. సోమవారం గుత్తిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా డీఎస్సీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీపై ఆధారాలు లేకుండా కోర్టును ఆశ్రయించి అనంతరం కేసును వెనక్కి తీసుకున్న వారు ఇప్పుడు మళ్లీ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీలో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. 2006 డీఎస్సీ, గ్రూప్–1 ప్రశ్నపత్రాల వ్యవహారం, కడప జెడ్పీకి సంబంధించిన అంశాలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు.



డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత, నిబంధనల అమలు, మెరిట్‌కు ప్రాధాన్యం ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా వారికి అండగా నిలవాలని వెంకట శివుడు యాదవ్ కోరారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# డీఎస్సీ అవినీతిపై సీబీఐ విచారణ జరపాలి

## విద్యాశాఖ మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి.. వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ



**గుత్తి, ఆగస్టు 10:( రిపబ్లిక్ న్యూస్)**డీఎస్సీ నియామకాల్లో అవినీతి, అక్రమాలపై సీబీఐ తో సమగ్ర విచారణ జరిపించాలని, ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని, నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అర్హత సాధించిన అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. డీఎస్సీ వ్యవహారంపై వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. సీబీఐ విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కోన మురళి, హుస్సేన్ పీరా, మల్లయ్య యాదవ్, వరలక్ష్మి, శాంతి ప్రియ, చంద్రగిరి రాధా యాదవ్, గురు ప్రసాద్, వరదరాజులు, వాల్మీకి రాము, వై.పి బాబు, గోపీనాథ్ రెడ్డి, రాజు, రఘునాథ్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు.పాల్గొన్నారు



# వక్ఫ్ ఆస్తులను పరిరక్షించి వాణిజ్యపరంగా అభివృద్ధి చేస్తాం

**ఆక్రమణలకు అడ్డుకట్ట.. శాశ్వత ఆదాయ వనరులే లక్ష్యం**

**వక్ఫ్ ఆస్తులను కొనడం, అమ్మడం చట్టవిరుద్ధం**

**కర్నూలులో వక్ఫ్ బోర్డు జోనల్ కార్యాలయం ఏర్పాటు**

**ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 10)**
వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడంతో పాటు వాణిజ్యపరంగా అనుకూలమైన భూములను అభివృద్ధి చేసి వక్ఫ్ బోర్డుకు శాశ్వత ఆదాయ వనరులు సమకూర్చడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.
కర్నూలు జిల్లాలోని పలు వక్ఫ్ ఆస్తులను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్త, సంబంధిత అధికారులతో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణల నివారణ, వాణిజ్య అభివృద్ధి అవకాశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో మీడియా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల్లో వాణిజ్యపరంగా అభివృద్ధి చేయడానికి అనుకూలమైన భూములను గుర్తించి, వాటి ద్వారా బోర్డుకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొన్ని ఆస్తులను వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలోనే అభివృద్ధి చేస్తామని, మరికొన్ని ఆస్తులను అర్హత, ఆర్థిక సామర్థ్యం కలిగిన వ్యక్తులు, సంస్థలకు నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక లీజుకు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.
వక్ఫ్ ఆస్తులు సమాజ ప్రయోజనం కోసం వినియోగించాల్సిన పవిత్ర ఆస్తులని, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పేదల సంక్షేమం, మసీదుల నిర్వహణ, ఇమామ్‌లు, మౌజన్ల సేవలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను సమర్థంగా



వినియోగించడం ద్వారా బోర్డుకు ఆదాయం పెరగడంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. వాణిజ్య సామర్థ్యం ఉన్న వక్ఫ్ భూములు ఖాళీగా ఉండి ఆదాయ వనరులుగా మారకపోవడం సరికాదని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్యపరంగా అనుకూలమైన వక్ఫ్ ఆస్తులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కర్నూలులో పరిశీలించిన ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లు, గోల్డ్ సౌక్ వంటి వాణిజ్య ప్రాజెక్టులకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

### వక్ఫ్ ఆస్తులను కొనడం, అమ్మడం వీల్లేదు

వక్ఫ్ ఆస్తులను ఎవరూ విక్రయించడానికి, ఎవరూ కొనుగోలు చేయడానికి వీల్లేదని షేక్ అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు. వంశపారంపర్యంగా ఇమామ్‌లు, మౌజన్లు, ఖతీబ్‌లు తదితరులు సేవలు అందిస్తున్నప్పటికీ, ఆ సేవల కారణంగా ఆస్తిపై వ్యక్తిగత యాజమాన్య హక్కు ఏర్పడదని తెలిపారు.
వక్ఫ్ ఆస్తులను వ్యక్తిగత ఆస్తులుగా భావించి విక్రయించడం లేదా కొనుగోలు చేయడం చట్టపరమైన సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రజలు స్థలాలు కొనుగోలు చేసే సమయంలో పత్రాలను పూర్తిగా పరిశీలించి, స్పష్టమైన యాజమాన్య హక్కులు ఉన్న స్థలాలనే కొనుగోలు చేయాలని సూచించారు. తక్కువ ధరకు వస్తుందనే కారణంతో వివాదాస్పద లేదా పత్రాలు సక్రమంగా లేని భూములను కొనుగోలు చేయవద్దని, భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వేర్వేరు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం ద్వారా వక్ఫ్ ఆస్తులపై హక్కులు ఏర్పడవని స్పష్టం చేశారు.

### ఆక్రమణల నివారణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని చైర్మన్ తెలిపారు. కర్నూలు జిల్లాలో వందల ఎకరాల వక్ఫ్ భూములు వివిధ వివాదాలు, ఆక్రమణలకు సంబంధించిన అంశాల్లో ఉన్నట్లు గుర్తించామని, వాటిపై పూర్తి వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు.
చాలా ఆస్తులకు సంబంధించి కోర్టు కేసులు ఉన్నాయని, వక్ఫ్ ఆస్తులను డిజిటలైజ్ చేయడం ద్వారా వాటి వివరాలను భద్రపరచడంతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధుల్లో తప్పిదాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలతో పాటు అవసరమైతే సస్పెన్షన్ వంటి చర్యలు కూడా ఉంటాయని తెలిపారు. ఇప్పటికే కొందరు అధికారులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

### కర్నూలులో వక్ఫ్ బోర్డు జోనల్ కార్యాలయం

కర్నూలును కేంద్రంగా చేసుకుని నంద్యాల తదితర ప్రాంతాలకు సేవలు అందించేలా వక్ఫ్ బోర్డు జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు చైర్మన్ తెలిపారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో వక్ఫ్ బోర్డు డెస్క్‌తో పాటు మహమ్మదియా కాంప్లెక్స్‌లో కార్యాలయం ఉందన్నారు.
శంషియా మసీదు కాంప్లెక్స్ సమీపంలోని భవనాన్ని మరమ్మతులు చేయించి జోనల్ కార్యాలయంగా వినియోగించనున్నట్లు తెలిపారు. అక్కడ లీగల్ టీమ్‌తో పాటు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని చెప్పారు.
కర్నూలు పర్యటనలో భాగంగా సుమారు 10 నుంచి 12 ప్రాంతాల్లో వక్ఫ్ భూములను పరిశీలించామని, మరికొన్ని ప్రాంతాలను కూడా తదుపరి పరిశీలిస్తామని తెలిపారు. వాణిజ్య ప్రాజెక్టులకు అనుకూలమైన భూములను గుర్తించి, వాటి ద్వారా బోర్డుకు ఆదాయం సమకూరేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు.

### అర్హత కలిగిన వారికి నిబంధనల మేరకు లీజులు

వక్ఫ్ ఆస్తుల్లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించాలనుకునే అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలకు నిబంధనల మేరకు లీజులు ఇచ్చేందుకు బోర్డు సిద్ధంగా ఉందని చైర్మన్ తెలిపారు. ఇందులో మతపరమైన వివక్షకు తావులేదని, అర్హత, ఆర్థిక సామర్థ్యం, నిబంధనల ప్రకారం లీజు పొందగలిగే ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.
వక్ఫ్ ఆస్తుల రికార్డులను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేస్తున్నామని తెలిపారు. గతంలో సుమారు 64 వేల ఎకరాలుగా ఉన్న వక్ఫ్ ఆస్తుల రికార్డులను ప్రస్తుతం 81 వేల ఎకరాల మేరకు గుర్తించి నమోదు చేసినట్లు చెప్పారు. తెలంగాణ నుంచి రావాల్సిన సుమారు 4,800 వక్ఫ్ ఆస్తుల ఫైళ్లను కూడా ఇటీవల తెప్పించినట్లు వెల్లడించారు.
డిజిటలైజేషన్ ద్వారా ఆస్తుల వివరాలు, సర్వే నంబర్లు, విస్తీర్ణం, హక్కులకు సంబంధించిన రికార్డులను భద్రపరచడంతో పాటు ఆక్రమణలను గుర్తించి అడ్డుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు.

### పేద ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ విద్య

వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో పేద ముస్లిం విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ తెలిపారు. నారాయణ, చైతన్య వంటి విద్యా సంస్థల్లో రెసిడెన్షియల్ విద్యను అందించే కార్యక్రమాలను బోర్డు తరఫున అమలు చేస్తున్నామని చెప్పారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ సహకారం, సూచనలతో రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.
వక్ఫ్ ఆస్తులను రక్షించడంతో పాటు వాటిని సమర్థంగా వినియోగించి బోర్డుకు శాశ్వత ఆదాయ వనరులు సమకూర్చడం, ఆ ఆదాయాన్ని పేదల సంక్షేమానికి వినియోగించడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.
ఈ మీడియా సమావేశంలో వక్ఫ్ బోర్డు సీఈవో యాకుబ్ ఖాజీ, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సభిహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన శక్తి టీం పోలీసులు

**కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో తప్పిపోయిన బాలుడిని గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగింత**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 10)**
కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని శక్తి టీం పోలీసులు చాకచక్యంగా గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు.కర్నూలు శక్తి టీం హెచ్‌సీలు 1584 ఎం. మహబూబ్ ఖాన్, 1725 సి. విజయ్ కుమార్‌లు ఆర్టీసీ బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తుండగా, పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన మంగలి ఉమా తన ఐదేళ్ల కుమారుడు ఎం. మంజునాథ్ బస్టాండ్‌లో తప్పిపోయాడని తెలిపి పోలీసుల సహాయం కోరారు.వెంటనే స్పందించిన శక్తి టీం సిబ్బంది బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అలంపూర్ ప్లాట్‌ఫామ్ వద్ద ఏడుస్తూ తిరుగుతున్న బాలుడిని గుర్తించారు. బాలుడిని సురక్షితంగా శక్తి టీం సిబ్బంది తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లి అప్పగించారు.తప్పిపోయిన బాలుడిని సకాలంలో గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చిన శక్తి టీం సిబ్బందిని పోలీసు అధికారులు అభినందించారు.

# స్వయంగా పంట నమోదు చేసుకునే అవకాశం



**బండి ఆత్మకూరు, ఆగస్టు 10, (రిపబ్లిక్ న్యూస్):** రైతులు సాగుచేసిన పంటల వివరాలను స్వయంగా పంట నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయనబండి ఆత్మకూరు మండలం పెద్దదేవలాపురం రైతు సేవ కేంద్రం నందు పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు కీలక సూచనలు చేశారు. సాగు చేసిన పంటలను రైతులు ఏపీఎస్ యాప్ ద్వారా పంట నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, ఆండ్రాయిడ్ ఫోన్ కలిగిన రైతులు స్వయంగా పంట నమోదు చేసుకోవచ్చునీ తెలిపారు. నమోదు అనంతరం పంట వివరాలు రైతు సేవా కేంద్ర సిబ్బంది ధ్రువకరిస్తారని వ్యవసాయ అధికారి వివరించారు. ఖరీఫ్ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆగస్టు 15 వరకు గడవు ఉందన్నారు. రైతులు త్వరగా పంట బీమా చేసుకోవాలని కోరారు. సాగుచేసిన ప్రతి పంట ప్రతి ల్యాండ్ పర్సల్ ఈ పంట నందు నమోదు కొరకు సెప్టెంబర్ 20న ఆఖరి తేదీ కనుక త్వరగా పంట నమోదు పూర్తిచేయాలని రైతు సేవ కేంద్ర సిబ్బందిని ఏఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది అర్పుత్ పాల్గొన్నారు.

# వైసీపీ రౌడీ మూకల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి

**పక్కా ప్లాన్ ప్రకారమే టీడీపీ నేత ఇంతియాజ్ హత్య: మంత్రి టీజీ భరత్**

**ఇంతియాజ్ హత్యపై పోలీసులు సీరియస్‌గా దర్యాప్తు చేయాలి**

**ముఖ్యమంత్రి చంద్రబాబుకు కర్నూలు పరిస్థితులను వివరిస్తా**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 10)**
కర్నూలులో వైసీపీ రౌడీ మూకలు హత్యలు, హత్యాయత్నాలతో అరాచకాలకు పాల్పడుతున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆరోపించారు. టీడీపీ కార్యకర్త ఇంతియాజ్ బాషా హత్య పక్కా పథకం ప్రకారమే జరిగిందని ఆయన అన్నారు. కర్నూలులోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.గత ఎన్నికల్లో ఇంతియాజ్ బాషా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారని మంత్రి తెలిపారు. నామినేషన్ ఉపసంహరించుకోవాలని అప్పట్లో వైసీపీ వర్గీయులు ఆయనను బెదిరించారని, ఇంటికి వెళ్లి గొడవకు దిగారని ఆరోపించారు. అనంతరం ఇంతియాజ్ టీడీపీలో చేరారని చెప్పారు.హంద్రీ నదిలో వైసీపీ కబ్జాలు, అక్రమాలను ఇంతియాజ్ బాషా బయటపెట్టారని, వాటిని ప్రశ్నించినందుకే ఆయనను హత్య చేశారని మంత్రి ఆరోపించారు. గత రెండేళ్లలో కర్నూలులో మూడు హత్యలు జరిగాయని, వాటిలో వైసీపీ ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. ఇంతియాజ్‌ను హత్య చేస్తామని పరోక్షంగా వారం రోజుల ముందే సోషల్ మీడియాలో పోస్టులు వచ్చినప్పటికీ ఇంటెలిజెన్స్ వర్గాలు ఎందుకు ముందస్తు సమాచారం సేకరించలేకపోయాయని ప్రశ్నించారు."ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తుందో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని సమగ్రంగా దర్యాప్తు చేయాలి" అని మంత్రి టీజీ భరత్ అన్నారు.గతంలో తన కార్యాలయం ఎదుట వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే విధంగా ర్యాలీలు నిర్వహించారని మంత్రి తెలిపారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి, తన కార్యాలయం ఉన్న మార్గంలో కాకుండా ఇతర మార్గాల్లో నిరసనలు నిర్వహించేలా చూడాలని కోరినప్పటికీ వైసీపీ నేతల వైఖరిలో మార్పు రాలేదన్నారు.
కర్నూలులో నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి వివరిస్తానని టీజీ భరత్ తెలిపారు. వైసీపీ ధోరణి ఇలాగే కొనసాగితే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.
1994 నుంచి 2004 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కర్నూలులో ఫ్యాక్షనిజాన్ని అదుపులోకి తీసుకువచ్చామని మంత్రి గుర్తు చేశారు. అవసరమైతే మరోసారి కఠిన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలను అంతమొందించినట్లే, ప్రస్తుతం అరాచకాలకు పాల్పడుతున్న రౌడీ మూకలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు.

# పత్తికొండలోనే మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి

**మొండి వైఖరి వీడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి**

**కంబాలపాడుకు తరలించడాన్ని వ్యతిరేకిస్తున్నాం.. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 10)**
పత్తికొండ నియోజకవర్గ కేంద్రానికి కేటాయించిన మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను పత్తికొండ పట్టణంలోనే ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శ్రీ నూరుల్ ఖమర్‌కు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు మాట్లాడుతూ.. నిత్యం కరువు, కాటకాలు, వలసలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పత్తికొండ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను కేటాయించిందన్నారు. అయితే పాఠశాలను ఎలాంటి సరైన రవాణా సౌకర్యాలు లేని కంబాలపాడుకు తరలించేందుకు ప్రయత్నించడం పట్ల పత్తికొండ ప్రజలు, విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.
పత్తికొండ నియోజకవర్గ కేంద్రంతో పాటు ప్రస్తుతం రెవెన్యూ డివిజన్‌గా గుర్తింపు పొందినప్పటికీ, బీసీ విద్యార్థులు చదువుకునేందుకు ఇప్పటివరకు సరైన వసతి సౌకర్యాలు లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. పత్తికొండలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తే పత్తికొండతో పాటు మద్దికెర, తుగ్గలి, దేవనకొండ, ఆలూరు, ఆస్పరి తదితర వెనుకబడిన మండలాలకు చెందిన విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.
వలసల కారణంగా పేద కుటుంబాల పిల్లలు విద్యకు దూరం కాకుండా ఉన్నత విద్యను అభ్యసించేందుకు పత్తికొండలోనే గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే అంబేద్కర్ గురుకుల పాఠశాలతో పాటు ఎస్సీ, బీసీ హాస్టళ్లు ఉన్న కంబాలపాడుకు మరో గురుకుల పాఠశాలను తరలించడం సమంజసం కాదని అన్నారు.
ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తన మొండి వైఖరిని విడనాడి నియోజకవర్గ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పత్తికొండలోనే మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేకు కేవలం కంబాలపాడు ప్రజలు మాత్రమే ఓట్లు వేయలేదని, మొత్తం పత్తికొండ నియోజకవర్గ ప్రజలు ఓటు వేసి గెలిపించారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.
గురుకుల పాఠశాలను పత్తికొండలో ఏర్పాటు చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని శ్రీనివాసులు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్, పత్తికొండ మండల కార్యదర్శి సిద్దు, జిల్లా సమితి సభ్యులు ఉపేంద్ర, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అభి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మెడలు వంచుతాం

**వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత హెచ్చరిక**

**డీఎస్సీ దగాపై వైసీపీ సమరభేరి**

**స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ఉల్లంఘన**

**శాంతియుత ర్యాలీలను అడ్డుకోవడం దుర్మార్గం**

**డీఎస్సీ అక్రమాలపై కదంతొక్కిన శ్రేణులు**











**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 10,(రిపబ్లిక్ న్యూస్):**
డీఎస్సీ నియామకాలలో అక్రమాలు జరగడంతో విద్యార్థుల భవిష్యత్ తో చలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వం మెదలువంచుతామని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు.అందులో భాగంగాస్పోర్ట్స్ కోటాలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారని, దీనిపై తక్షణం సీబీఐ విచారణ చేయించాలని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమాలు చేస్తామని, అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. డీఎస్సీ2025లో అక్రమాలపై సోమవారం అనంతపురంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పవర్ ఆఫీస్ నుంచి పాతూరులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు పార్టీ శ్రేణులు కదంతొక్కాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు.

**ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9500 కోట్లు**

ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ నియామకాలను అవినీతిమయం చేశారన్నారు. పేపర్ లీకేజ్‌తో పాటు స్పోర్ట్స్ కోటాకు సంబంధించి కూడా జీవోలు మార్చారని తెలిపారు. స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి ఎందుకు మార్చారని ప్రశ్నించారు. కావాల్సిన వాళ్లకు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఇచ్చుకుని ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై తక్షణం సీబీఐ విచారణతో పాటు నైతిక బాధ్యతగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీకి సంబంధించి అసెంబ్లీలో చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలు చెబుతున్నారని.. శాసన మండలిలో చర్చించే ధైర్యం లేదా? అని అన్నారు. డీఎస్సీ అక్రమాలతో పాటు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9500 కోట్లు చెల్లించాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లతో ఇప్పటికే కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసి నియోజకవర్గ స్థాయిలో రిలే నిరాహార దీక్షలు కూడా చేసినట్లు తెలిపారు.

**తాడిపత్రికి వెళ్తుంటే అడ్డుకోవడం దుర్మార్గం**

రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు చేపడుతుంటే విజయవాడ, పులివెందుల, గుంటూరు, కడప జిల్లాతో పాటు తాడిపత్రిలో నిరసనలు తెలియజేయడానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాడిపత్రికి వెళ్తుంటే అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలో తన ఇంట్లో నుంచి బయటకు రాకుండా చేశారన్నారు. ఈ ప్రభుత్వానికి కాలం దగ్గరపడిందని హెచ్చరించారు. డీఎస్సీలో కోచింగ్ సెంటర్లు పెట్టుకున్న వాళ్లకు, పరీక్ష ప్రక్రియలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్న వ్యక్తికి ఫస్ట్ ర్యాంకులు వచ్చాయన్నారు. తక్షణం స్పోర్ట్స్ కోటాకు సంబంధించి వివరాలన్నీ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

**రెడ్‌బుక్ రాజ్యాంగంతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తారా**

బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగుల ఆశలను చంద్రబాబు ప్రభుత్వం చిదిమేసిందని తెలిపారు. విద్యార్థి, యువత, నిరుద్యోగులు, డీఎస్సీలో అన్యాయానికి గురైన వారి తరపున పోరాడుతుంటే రెడ్‌బుక్ రాజ్యాంగంతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. యువత రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోవడం లేదని, భవిష్యత్‌లో ఉద్యమాలు తీవ్రంగా ఉంటామని హెచ్చరించారు. డీఎస్సీలో అన్యాయానికి గురైన అభ్యర్థులతో పాటు యువత, విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలు చేస్తామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులను రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్ అంటూ అధికార పార్టీ నేతలు అవహేళగా మాట్లాడుతున్నారని, భవిష్యత్‌లో యువత సత్తా ఏమిటో తెలియజేస్తామన్నారు.

# మానవత్వానికి ప్రతీక.. గర్భిణులకు అన్నదానం

**మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలకల బాల రామాంజనేయులు**



**ఉరవకొండ, ఆగస్టు 10:( రిపబ్లిక్ న్యూస్)**
గర్భిణులకు పోషకాహారం అందించడం అభినందనీయమని సీఐ మహానంది అన్నారు. ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం మాల మహానాడు ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాల రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మందికి భోజన వసతి కల్పించారు.ఈ సందర్భంగా సీఐ మహానంది మాట్లాడుతూ.. గర్భిణులకు అవసరమైన సమయంలో పోషకాహారం అందించడం ద్వారా వారికి అండగా నిలవడం మంచి సేవా కార్యక్రమమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, వారికి పౌష్టికాహారం అందించడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో గర్భిణులకు భోజనంతో పాటు కోడిగుడ్లు, అరటిపండ్లు తదితర పోషకాహారాన్ని అందించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని మాల మహానాడు నాయకులు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, సీడీపీవో శ్రీదేవి, డాక్టర్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. మాల మహానాడు స్థానిక నాయకులు మాల మల్లికార్జున, మాల శివ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గర్భిణులకు పోషకాహారం అందించిన మాల మహానాడు నాయకులను అధికారులు, స్థానికులు అభినందించారు.

# డీఎస్సీ అక్రమాలపై వైసీపీ ర్యాలీ

**విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్**






**మంత్రాలయం, ఆగస్టు 10 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహం నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ యువతకు భృతి తక్షణమే చెల్లించాలని, డీఎస్సీ అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ కంబగిరి రాముడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు సురేందర్ రెడ్డి, ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బి.ఆర్. బసిరెడ్డి, కదిరికోట సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ పనుల్లో వేగం పెంచాలి

**సంకెన్ పిట్లు, చెక్‌డ్యామ్‌లు, క్యాస్కేడ్ ట్యాంకుల నిర్మాణానికి ప్రాధాన్యం**

**ఆగస్టు 14న ప్రతి గ్రామ పంచాయతీలో భారీగా మొక్కలు నాటాలి**

**పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు**

**జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 10)**
జిల్లాలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచే లక్ష్యంతో చేపట్టిన జలధారజలహారతి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. గతంలో చేపట్టిన పనుల ద్వారా సుమారు 0.49 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం ఏర్పడిందని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ, వీబీజీ రామ్‌జీ, విద్య తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారం, పెండింగ్ అంశాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించి, సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభల ద్వారా వర్షపు నీటి ప్రవాహ మార్గాలు, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, సహజ నీటి ప్రవాహాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేలా క్యాస్కేడ్ ట్యాంకులు, చెక్‌డ్యామ్‌లు, ఫీడర్ ఛానళ్లు, ఫామ్ పాండ్లు, రిటెన్షన్ పిట్లు, సంకెన్ పిట్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సంకెన్ పిట్లను నిర్దేశిత కొలతల ప్రకారం నిర్మించి, వాటి సంఖ్య, పరిమాణం, ప్రదేశం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రతిపాదించిన పనులు, కొత్త పనులు రెండుసార్లు నమోదు కాకుండా అధికారులు పరిశీలించాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే రెండు రోజుల్లో హాజరును మరింత పెంచి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. పనితీరు సరిగా లేని ఏపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, వరుసగా మూడు నోటీసుల అనంతరం కూడా పనితీరులో మార్పు లేకపోతే శాఖాపరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఏపీఓలు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలను పనులకు సమీకరించాలని సూచించారు.

ఆగస్టు 14న ప్రతి గ్రామ పంచాయతీలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆగస్టు 12, 13 తేదీల్లో అటవీ, డ్వామా నర్సరీల నుంచి 23 అడుగుల ఎత్తు ఉన్న మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో నిర్దేశించిన 5,000 ఎకరాల లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.

వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు పంటల బీమా, పీఎండీఎస్ వంటి ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో గుర్తించిన పనులను త్వరగా పూర్తి చేసి, వాటి పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని అధికారులకు సూచించారు.

**పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు**
పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీలను చివరి నిమిషంలో కాకుండా ముందుగానే పూర్తిస్థాయిలో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత వరకు కృషి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్వే, భూ రికార్డులకు సంబంధించిన ఆన్‌లైన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సాంకేతిక కారణాలతో అర్జీదారులకు ఇబ్బందులు కలిగించరాదని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంహెచ్‌ఓలు, తహసీల్దార్లు ప్రతిరోజూ డీఆర్‌ఓను కలిసి సమీక్షించుకోవాలని సూచించారు.

మండల సర్వేయర్లు భూ సర్వేకు వెళ్లే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు నోటీసులు జారీ చేయాలని, సర్వే అనంతరం పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నోటీసులు



జారీ చేయకుండా సర్వేలకు వెళ్లడం, నిబంధనలు పాటించకపోవడం తన దృష్టికి వచ్చిందని, ఇకపై పద్ధతి మార్చుకోకపోతే సంబంధిత సర్వేయర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారం, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, పీజీఆర్ఎస్ అంశాలపై ఉన్నతస్థాయి అధికారులు నిరంతరం సమీక్షిస్తున్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను సంబంధిత మండల అధికారులు స్వయంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా సమంజసమైన నివేదికలను సిద్ధం చేసి నిర్ణీత సమయంలో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

అర్జీల పరిష్కారంలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రజలకు త్వరగా న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని, అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారెడ్డి, నైపుణ్యాభివృద్ధి అధికారి దీప్తి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత మండల అధికారులు పాల్గొన్నారు.

# దరఖాస్తు సవరణకు రెండు రోజులు అవకాశం



**ఎమ్మిగనూరు, ఆగష్టు, 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** నవోదయ విద్యాలయం 202728 ప్రవేశ దరఖాస్తుల సవరణకు రెండు రోజులు మాత్రమే గడువు ఉందని బనవాసి నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ దరఖాస్తులో నమోదైన వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. లింగం, వర్గం (జనరల్/ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ), ప్రాంతం (పట్టణం/గ్రామీణం), పరీక్ష మాధ్యమం (తెలుగు/ఇంగ్లీష్), వైకల్యం తదితర వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని తెలిపారు. వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే ఆగస్టు 11, 12 తేదీల్లో అందుబాటులో ఉండే ఎడిట్ సౌకర్యం ద్వారా సరిచేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా అవసరమైన సవరణలు చేసుకోవాలని విద్యార్థులను కోరారు.

# చిప్పగిరి పీ హెచ్ సి లో టిబి, ఎక్రే కార్యక్రమం

**సిహెచ్‌ఓ వెంకటేశ్వర్లు**





**చిప్పగిరి, ఆగస్టు, 10,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సోమవారం సిహెచ్‌ఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీబి ఎక్రే కార్యక్రమం నిర్వహించారు, మాట్లాడుతూ గ్రామీణ మరియు మారుమూల ప్రాంతాల్లో కూడా టీవీ రూల్ త్వరగా గుర్తించడం, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి ఇతరులను సోకకుండా నివారించడం, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద ఎక్రే మరియు మందులు ఉచితంగా అందించడం, టీబీ లక్షణాలు ఉన్న వారికి అనుమానితు లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా జాతీయ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు, ఈ కార్యక్రమంలో టిబిఎస్టిఎస్ గోపాల్, ఎం హెచ్ పి ఎస్ రామ్మోహన్, ఎమ్ ఎల్ హెచ్ పి చంద్రకళ, ఎస్ టి ఎల్ ఎస్ జీవిత, ఏఎన్‌ఎంఎస్, ఆశలు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# రైతు కార్మిక సంఘాల నిరసన

**రాస్తారోకో.. నాయకుల అరెస్టు**










**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 10,(రిపబ్లిక్ న్యూస్):**
రైతు, కార్మిక సంఘాలు కదం తొక్కాయి. సంయుక్త కిసాన్ మోర్చా, జాతీయ కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా అనంతపురం నగరంలోని తపోవనం హైవేపై సోమవారం భారీ నిరసన చేపట్టారు. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్), ఐఎఫ్‌టీయూ, ఇతర రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.

**నినాదాలతో దద్దరిల్లిన తపోవనం :** రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాయకులు, కార్యకర్తలు హైవేపై బైఠాయించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. దీంతో తపోవనం హైవేపై కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**అడ్డుకున్న పోలీసులు.. అరెస్టులు :** రాస్తారోకోతో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆందోళనకారులను అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**పోరుబాటలో సంఘాల నేతలు :** ఆందోళనలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఈహెచ్ రాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి గుంతకల్లు రామాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు సంజప్ప, రాముడు, వెంకటేశులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, బి.నాగరాజు, పట్టణ పేదల సంఘం నాయకుడు వీరనారప్ప తదితరులు, భగత్ సింగ్ నగర్ నాగరాజు, మున్నా తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, రామయ్యకాలనీతో పాటు పామిడి, కూడేరు మండలాల నుంచి ఏఐకేఎంఎస్ కార్యకర్తలు తరలివచ్చారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై 'జైల్ భరో'

**రాష్ట్రవ్యాప్తంగా ..కార్మిక సంఘాల ఆందోళనలు. అరెస్టులు**






**అనంతపురం క్రైమ్, ఆగస్టు 10,( రిపబ్లిక్ న్యూస్):**
కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వేమన డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాల పరిరక్షణ కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం 'జైల్ భరో' కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురంలో జాతీయ రహదారిపై కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు బైఠాయించి నిరసన తెలిపారు.

**కార్మికుల హక్కులపై దాడులను తక్షణమే నిలిపివేయాలి**
ఈ సందర్భంగా వేమన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తోందని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి చర్చలు జరపకుండా పోలీసు బలాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. కార్మికుల హక్కులపై దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు బైఠాయించడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నిరసనలో పాల్గొన్న పలువురిని అరెస్టు చేసి నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టులు, నిర్బంధాలతో కార్మికుల పోరాటాన్ని అడ్డుకోలేరని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

**విడుదల చేయాలని డిమాండ్ :** అరెస్టు చేసిన కార్మిక నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు టీఎస్ వలి, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి పరశురాముడు, మహబూబ్‌సాబ్, గౌస్, బాలకృష్ణ, సుజాత, షరీఫా, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండ

**: మంత్రి టీజీ భరత్**

**రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేత..**

**వైద్య, మెడికల్ పీజీ ఫీజు ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది**

**ఎక్లాస్పూర్‌లో ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 10)**
జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ భరోసా ఇచ్చారు. రాజమండ్రిలో ఇద్దరు వ్యక్తులు నిర్లక్ష్యంగా కారు నడిపి ఢీకొన్న ఘటనలో ప్రియాంక మృతి చెందిన నేపథ్యంలో మంత్రి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు.

ఎక్లాస్పూర్ గ్రామానికి వెళ్లిన మంత్రి టీజీ భరత్.. ప్రియాంక మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రియాంక తండ్రి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.20 లక్షల ఆర్థిక సాయం చెక్కును ప్రియాంక తండ్రికి అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రియాంక మృతి తీవ్రంగా కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుని, వారికి కఠిన శిక్షలు పడేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ప్రియాంక చికిత్స పొందిన సమయంలో ఆసుపత్రిలో అయిన వైద్య ఖర్చులతో పాటు, ఆమె మెడికల్ పీజీ సీటుకు సంబంధించిన ఫీజు ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ కష్ట సమయంలో ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రియాంక కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని, కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని విధాలా తోడుగా ఉంటామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

# రాహుల్‌గాంధీతో రఘువీరారెడ్డి భేటీ

**విపక్ష నేతను మర్యాదపూర్వకంగా కలిసిన ఏఐసీసీ సభ్యుడు**



**న్యూఢిల్లీ/ అమరావతి(ప్రతినిధి), ఆగస్టు10 ,(రిపబ్లిక్ న్యూస్):**
ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి పార్లమెంట్‌లో లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా జరిగిన ఈ భేటీ రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీతో రఘువీరారెడ్డి ఆత్మీయంగా ముచ్చటించారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు తదితర అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ చేపడుతున్న కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల పనితీరుపైనా చర్చించినట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ వేదికగా ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న రాహుల్‌గాంధీని రఘువీరారెడ్డి కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను జాతీయ స్థాయిలో ప్రస్తావించాల్సిన అవసరంపై కూడా చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. పార్టీ నాయకత్వంతో సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీతో భేటీ అనంతరం రఘువీరారెడ్డి పార్టీ శ్రేణులతో సమావేశమై తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ఈ భేటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడిగా దొణస్వామి

**అమిలినేని సురేంద్రబాబు శుభాకాంక్షలు**



**అనంతపురం/కళ్యాణదుర్గం,ఆగస్టు10,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లా కురుబ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దురుదకుంట దొణస్వామికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దొణస్వామికి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన దొణస్వామి నాయకత్వంలో జిల్లా కురుబ సంఘం మరింత బలోపేతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కురుబ సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు సంఘ సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సామాజిక ఐక్యతను పెంపొందించడం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి వంటి అంశాల్లో యువతకు అండగా నిలవడం ద్వారా సంఘం మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కురుబ సంఘం నూతన కార్యవర్గం సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా దొణస్వామి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన సంఘ పెద్దలు, నాయకులు, సభ్యుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. సంఘ ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తూ కురుబ సామాజికవర్గం అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దొణస్వామికి పలువురు కురుబ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా భూక్య జంపన్న జన్మదిన సందడి.

**కాకతీయ, ఉస్మానియా యూనివర్సిటీల్లో విద్యార్థుల వేడుకలు..**

**ములుగులో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు..**

**పలు జిల్లాల్లో అన్నదానాలు**

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 10**
ములుగు జిల్లా బీఆర్ఎస్ నాయకులు భూక్య జంపన్న జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా సందడి రేపాయి. ములుగు జిల్లా నుంచి హైదరాబాద్ వరకు, వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల వరకు జంపన్న అభిమానులు, విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.
వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు జంపన్న జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా, హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలోనూ విద్యార్థులు జంపన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల్లో జంపన్నకు ఉన్న ఆదరణకు ఈ కార్యక్రమాలు నిదర్శనంగా నిలిచాయని ఆయన అభిమానులు పేర్కొన్నారు.
ములుగు జిల్లాలోని జంపన్న కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలకు భోజనం వడ్డించారు. జిల్లాలోని వివిధ మండలాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ జంపన్న జన్మదిన వేడుకలు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.

**విద్యార్థుల నుంచి బీఆర్ఎస్ శ్రేణుల వరకు.. జన్మదిన వేడుకల హోరు**

కాకతీయ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీల్లో విద్యార్థులు ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించడం, ములుగు జిల్లాలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున వేడుకలు చేపట్టడం, ఇతర జిల్లాల్లోనూ అభిమానులు జన్మదిన కార్యక్రమాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా జంపన్న అభిమానులు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారు.





జంపన్న రాజకీయ ప్రస్థానానికి, ప్రజా సమస్యలపై ఆయన చేస్తున్న పోరాటానికి అభిమానులు, యువత నుంచి లభిస్తున్న మద్దతుగా ఈ వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు అభివర్ణించాయి.
ములుగు నుంచి రాష్ట్రవ్యాప్తంగా.. జంపన్న జన్మదిన వేడుకలు రాజకీయ వర్గాల్లోనూ హాట్‌టాపిక్‌గా మారాయి.

## అసిఫా మృతికి సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**విచారం వ్యక్తం చేసిన హోంమంత్రి అనిత**

**భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన డిజిపి**

**అమరావతి, ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** : రోడ్డు ప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం కుమార్తె ఎండీ అసిఫా మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఎంతో భవిష్యత్తు ఉన్న అఫిఫా.. 24 ఏళ్ల చిన్న వయస్సులో రోడ్డు ప్రమాదం బారిన పడి అందరికీ దూరమవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీ అసిఫా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. షరీన్ బేగం, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నానని ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు.
విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం కుమార్తె అఫిఫా రోడ్డు ప్రమాదంలో
మృతిపై హోం మంత్రి వంగలపూడి అనిత విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న.. 24 ఏళ్ల వయసులోనే నిండు జీవితాన్ని కోల్పోవడం బాధాకరమన్నారు. అసిఫా మృతి తీవ్రంగా కలచివేసిందని ఆవేదన చెందారు. విషాద సమయంలో అసిఫా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని కోరుకున్నారు. అసిఫా ఆత్మకు శాంతి చేకూరాలని హోం మంత్రి అనిత ప్రార్థించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం కుమార్తె అసిఫా భౌతికకాయానికి ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా నివాళులర్పించారు. అజిత్ సింగ్ నగర్‌కు చేరుకున్న డీజీపీ, సీపీ.. అసిఫాకు నివాళులర్పించి, షరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆదివారం స్నేహితులతో కలిసి సరదాగా గడుపుదామని కారులో చీరాల బీచ్‌కు బయలుదేరిన అసిఫా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. గుంటూరు జిల్లా ఏటుకూరు సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో వెనకాల నుంచి వచ్చిన కారు దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అసిఫా అక్కడికక్కడే మృతిచెందగా, కారులో ప్రయాణికులు నలుగురు గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స నిమిత్త స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
------

## ఆర్ఐవోపై ఆరోపణలు కలకలం

**అనుమతుల్లేని కళాశాలలపై ఎన్‌టీఎఫ్ ఫిర్యాదు**

**విచారణకు ఆర్‌జేడీకి డీఆర్ఓ సూచన**

**ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా కొనసాగుతున్న జూనియర్ కళాశాలల వ్యవహారంతో ఆర్ఐవోపై అనేక ఆరోపణలు రావడం కలకలం రేపాయి. ఈ సందర్భంగా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) విద్యార్థుల పక్షాన గళమెత్తింది. అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాల్సిన ఆర్ఐవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఎన్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. ఆర్ఐవోపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఆర్ఐవోపై ఫిర్యాదు చేశారు.

**కేవలం తాత్కాలిక హాస్టల్ మాత్రమే కొనసాగుతోంది**

రాష్ట్ర కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ
అనంతపురం నగర, రూరల్ పరిధిలోనే పలు జూనియర్ కళాశాలలకు ప్రభుత్వ అనుమతులు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుత్తి రోడ్డు మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న ఆర్బిట్ జూనియర్ కళాశాల, ఎస్ఆర్



కళాశాలల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండానే కళాశాల, హాస్టల్ నిర్వహిస్తున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థినుల హాస్టళ్ల నిర్వహణపై అధికారులు సమగ్రంగా తనిఖీలు చేపట్టి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. ఈ అంశాన్ని ఆర్ఐవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, అక్కడ కళాశాల నిర్వహణ లేదని కేవలం తాత్కాలిక హాస్టల్ మాత్రమే కొనసాగుతోందంటూ ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చినట్లు తమకు సమాచారం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కళ్యాణదుర్గం రోడ్డులోని ఎక్సెల్ కళాశాలపైనా అనుమతుల విషయమై సందేహాలు ఉన్నాయని, కళాశాల కోడ్ గురించి విద్యార్థులు యాజమాన్యాన్ని ప్రశ్నించిన సందర్భాలున్నాయని తెలిపారు. త్వరలో అనుమతులు, కళాశాల కోడ్ వస్తాయని చెబుతున్నట్లు పేర్కొంటూ దీనిపై అధికారికంగా పరిశీలన జరపాలని కోరారు. కొడిమి ఎన్‌సీసీ నగర్ సమీపంలోని ఓ గురుకుల కళాశాలతో పాటు మరికొన్ని విద్యాసంస్థలు కూడా అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయన్నారు.

**ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం పెరుగుతోందని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలు ఈ అంశాలపై ఆందోళనలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల అనుమతులు, కళాశాల కోడ్‌లు, హాస్టళ్ల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత తదితర అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ఎన్‌టీఎఫ్ డిమాండ్ చేసింది. ఎన్‌టీఎఫ్ ఫిర్యాదుపై జిల్లా రెవెన్యూ అధికారి మలోల స్పందించి, ఆర్ఐవోపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌జేడీకి సూచించినట్లు ఎన్‌టీఎఫ్ నాయకులు తెలిపారు. ఆర్‌జేడీ స్థాయి అధికారి నిష్పక్షపాతంగా విచారణ నిర్వహిస్తే ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణల్లో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీజీఆర్ఎస్‌లో ఎన్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్‌కుమార్‌తో పాటు పలువురు సంఘం నాయకులు పాల్గొని ఫిర్యాదు అందజేశారు.

# సాహిత్య సుగంధం వెదజల్లిన ఖమ్మం

**తోట సుభాషిణి**

**సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం**

**కవులు, రచయితల సందడి..**

**కథ, కవిత్వ పోటీ విజేతలకు బహుమతులు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 10,(రిపబ్లిక్ న్యూస్):**
ఖమ్మం వేదికగా సాహిత్య పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. ఖమ్మం సాహిత్య సుగంధం వెద జల్లిందని తోట సుభాషిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాహిత్యాభిమానుల ఆత్మీయ కలయికకు ఖమ్మం వేదికగా నిలిచింది. హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ (హెచ్‌ఆర్‌సీ) ఆధ్వర్యంలో 2026 సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కథ, కవిత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు ప్రముఖ సాహితీవేత్త నాగశేషుకు సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. సాహిత్య రంగానికి చెందిన ప్రముఖులు, కవులు, రచయితలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేశారు.

**సాహిత్య రంగంలో కొనసాగుతున్న వారికి ప్రోత్సాహం**

సాహిత్యాన్ని ప్రోత్సహించడం, కొత్తగా రచనా రంగంలోకి వస్తున్న వారిని ప్రోత్సహించడం



లక్ష్యంగా హెచ్‌ఆర్‌సీ నిర్వహించిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. సభ ప్రారంభం నుంచి ముగింపు వరకు సాహిత్య చర్చలు, ప్రసంగాలు, అభినందనలు, ఆత్మీయ పలకరింపులతో కళకళలాడింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రసేన్ సాహిత్య ప్రాధాన్యతను వివరిస్తూ సభను ముందుకు నడిపించారు. సాహిత్యాన్ని కేవలం రచనలకే పరిమితం చేయకుండా సమాజంతో దాని అనుబంధాన్ని వివరించారు. సాహిత్య రంగంలో కొనసాగుతున్న వారికి ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. ఆయన చేసిన పలు వ్యాఖ్యలు సభికులను ఆకట్టుకున్నాయి. ఆనందాచారి సాహిత్యానికి ఉన్న పరిధి, దాని అవధుల గురించి విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. శ్రీరామ్ ఆత్మీయంగా మాట్లాడి సభలో సాహిత్య చర్చకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చారు. వంశీకృష్ణ తన వాక్చాతుర్యంతో సభికులను ఆకట్టుకోగా, సంధ్యారాణి సాహిత్యానికి సంబంధించిన పలు జ్ఞాపకాలను ప్రస్తావిస్తూ ఆసక్తికరంగా మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు, రచయితలు, అవార్డు గ్రహీతలు తమ అనుభవాలను పంచుకున్నారు.

**'ఇంతటి ఆదరణ మరచిపోలేను' :**

ఫౌండేషన్ నిర్వాహకురాలు తోట సుభాషిణి మాట్లాడుతూ.. ఒక మహిళ సాహిత్య సంస్థను



స్థాపించి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే ఇంతమంది సాహిత్యాభిమానులు తనకు అండగా నిలవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు. సుమారు 80 మంది సాహిత్య సభకు హాజరు కావడం తనకు సాధారణ విషయం కాదని, తనపై ఉన్న ప్రేమాభిమానాలకు ఇది నిదర్శనమని అన్నారు. తనను అభిమానించే సాహితీ మిత్రులు, శ్రేయోభిలాషులు, అవార్డు గ్రహీతలు, స్నేహితులు కార్యక్రమానికి హాజరై తనకు మరింత ప్రోత్సాహాన్ని అందించారని తెలిపారు. తన కోసం వస్తామని చెప్పే ఆత్మీయులు ఉండటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఖమ్మంలో తాను ఉన్నానని చెప్పుకునేందుకు తన చుట్టూ ఉన్న ఈ సాహితీ బలగం ఎంతో గొప్పదని పేర్కొన్నారు.

**సభకు హాజరైన వారందరికీ కృతజ్ఞతలు :**

కార్యక్రమానికి హాజరైన ప్రసేన్, సీతారాం, శ్రీరామ్, ఆనందాచారి, వంశీకృష్ణ, సంధ్యారాణి, ధరణికోట రమేష్ తదితరులకు సుభాషిణి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇబ్రహీం, జయశ్రీ మువ్వ, ఫణిమాధవి, రాధ, కొండు బ్రహ్మం, నామ పురుషోత్తం, ఆంజనేయులు, సత్యనారాయణ, ఉపేందర్, శ్రీనివాస్ సూఫీ తదితరులు పాల్గొని కార్యక్రమానికి మరింత సాహిత్య శోభను తీసుకొచ్చారని పేర్కొన్నారు. హెచ్‌ఆర్‌సీ సాహితీ పురస్కారాలను అందుకున్న విజేతలకు ఆమె అభినందనలు తెలిపారు. కథ, కవిత్వ పోటీల్లో ప్రతిభ చూపిన రచయితలు, కవులను సన్మానించి బహుమతులు అందజేశారు. సాహిత్య రంగంలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

**'మరో ఏడాది సాహిత్య ప్రయాణానికి ఇదే స్ఫూర్తి'** :
సభలో లభించిన ఆత్మీయత, అభిమానమే తనకు మరింత బలాన్నిచ్చాయని సుభాషిణి పేర్కొన్నారు. సభకు వచ్చిన ప్రతి ఒక్కరూ తనవారేననే భావన కలిగిందన్నారు. సాహిత్యాన్ని ప్రేమించే ఇంతమంది తన వెంట ఉన్నారనే విషయం మరోసారి రుజువైందని చెప్పారు. సభ విజయవంతంగా జరగడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఈ ఆదరణతో మరో ఏడాది సాహిత్య కార్యక్రమాలను మరింత ఉత్సాహంతో కొనసాగించేందుకు స్ఫూర్తి లభించిందని తెలిపారు. సాహిత్యాన్ని ప్రేమించే వారంతా ఒకే వేదికపై కలుసుకోవడం, కొత్త రచయితలకు ప్రోత్సాహం లభించడం, ప్రతిభావంతులకు పురస్కారాలు అందించడం ద్వారా హెచ్‌ఆర్‌సీ కార్యక్రమం సాహితీ వర్గాల్లో ప్రత్యేకతను చాటుకుంది.

## దేవాలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గ ఎన్నికైన క్యాతం సురేష్ రెడ్డి



**మల్లాపూర్ ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్)**
మల్లాపూర్ దేవాలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా క్యాతం సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గండికోట గంగ నరసయ్యలను సోమవారం ఎన్నుకున్నారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని గ్రామ కుల సంఘ పెద్దమనుషుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అనంతరం శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ మల్లాపూర్ లోని దేవాలయాల అభివృద్ధికి కమిటీ సమిష్టిగా కృషి చేయాలని ఆలయ అభివృద్ధితోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కమీటీ చైర్మన్ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సురేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, మాజీ చైర్మన్ సంఘ గంగ రాజం, నాయకులు ఏనుగు వెంకట్ రెడ్డి, కుల సంఘ పెద్దమనుషులు ఎగుర్ల కొమరయ్య, వెలుమల రాజారెడ్డి, చిప్ప శంకర్, తోట శాంతరాజం, నూతిపెల్లి రాజం ,డాక్టర్ స్వామి, నర్సారెడ్డి , శ్రీపాద వెంకటాద్రి , సత్యం, మురపు గంగరాజం, ఆశాలు, రాజేందర్ , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎలుక కమలాకర్



**మల్లాపూర్ ఆగష్టు 9 (రిపబ్లిక్ న్యూస్)**
ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎలుక కమలాకర్ ను నియమిస్తున్నట్టు ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట నరసయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం మెట్‌పల్లి పట్టణంలో ఎలుక కమలాకర్ కు నియమక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తూనే యువజన సంఘం బలోపేతానికి పనిచేయాలని సూచించారు. ఎలుక కమలాకర్ మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట్ నరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్క మోహన్, రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల శ్రీధర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెంటపర్తి అశోక్, మెట్పల్లి డివిజన్ కమిటీ నాయకులు తుక్కరామ్, కోరుట్ల డివిజన్ అధ్యక్షులు శోభన్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జగిత్యాల లో జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటు,

### త్వరలో పవన్ కళ్యాణ్ తో భారీ బహిరంగా సభ





**రాయికల్ మండలం ఆగస్టు,10( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటుకు భవిష్యత్తు కార్యాచరణపై జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ తళ్లూరి ని జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ బెక్కం జనార్ధన్ కలవడం జరిగింది. జగిత్యాల గడ్డపై జనసేన పార్టీ ఆఫీసు ఏర్పాటుకు రామ్ తాళ్లూరి సానుకూలంగా స్పందించారని జనార్ధన్ తెలిపారు. త్వరలోనే జగిత్యాలలో ఆంధ్రప్రదేశ్‌ఉప ముఖ్యమంత్రి కోనేదాల పవన్ కళ్యాణ్ చె జనసేన పార్టీ భారీ బహిరంగ సభను కూడ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక తయారు చేస్తున్నామని జగిత్యాల గడ్డపై జనసేన జెండాను పెద్ద ఎత్తున ఎగరేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. జనసేన పార్టీ నాయకులు ఆకుల వెంకటేష్ కళ్యాణ్ సంకీర్తన్ అజయ్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు

## వేములవాడ శ్రీ రాజరాజేశ్వరాలయం సేవలో రాయికల్, మైతపూర్ వాసులు.







**రాయికల్ మండలం ఆగష్టు,10( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల జిల్లారాయికల్ పట్టణము,మహితాపూర్ గ్రామనికి చెందిన మహిళా సేవకులు, జగిత్యాల పట్టణంలోని మహిళా సేవకులు వల్లి సేవ సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరాలయం లో సోమవారం రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు కొంతమంది భీమ్మ న్న ఆలయంలో మరికొందరు బద్ది పోచమ్మ దేవాలయం వద్ద భక్తుల రద్దీ ని బట్టి వారికి క్యూ లేను యందు సక్రమంగా నిలకడగా ఉండేవి దంగా వారికి లైన్ లో ఉన్నవారికి దాహార్తిని తీర్చడానికి నీళ్లను సప్లయి చేశారు. మరి కొంతమంది భీమ్మన్న గుడి యందు లైన్ లో సక్రమంగా నిలకడగా ఉండే విధంగా అక్కడకు వచ్చిన వారందరికీ దర్శన భాగ్యం కల్పించారు. సేవా కు వెళ్లిన వారందరికీ శ్రీ రాజరాజేశ్వరాలయం వారు శ్రీ వల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మరియు మహితాపూర్ గ్రామ ని కి చెందిన బేతి రాధ, పెద్దిరెడ్డి రాజేశ్వరి, అనుమల్ల విజయ,మార్గం లక్ష్మి,ఎనుగంధుల విజయ, ఎనుగందుల జయ, మొగిలపేట లక్ష్మి మాధురి,జల, లక్ష్మి ,రాధ,ఎనగందుల కళా తదితరులు పాల్గొన్నారు.

## అందోల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం.

**-ఎమ్మార్పీఎస్ గ్రామ మండల కమిటీ యుద్ధ ప్రాతిప్రాధికను పూర్తి చేయాలి.**

**-జిల్లా ఇన్చార్జి వి ఎస్ రాజు మాదిగ.**



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 10**అందోల్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల గురించి జిల్లా ఇన్చార్జి వి ఎస్ రాజు మాట్లాడుతూ మండల కమిటీలు త్వరగా పూర్తి చేసుకోవాలని నిబంధనతో పని చేయాలని వరంగల్లో సెప్టెంబర్ 9 జరిగే ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సుకు పూర్తిస్థాయి మండల కమిటీలను పెద్ద ఎత్తున తరలించాలని జిల్లా ఇన్చార్జ్ వి ఎస్ రాజు మాదిగ అన్నారు. భవిష్యత్తులో కార్య చరణకు మాదిగ విద్యార్థులు యువత మహిళలు పెద్ద ఎత్తున సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అందోల్ మండలం ఇంచార్జ్ తుడుం రాములు మాదిగ, చౌటాకుర్ మండలం ఇంచార్జ్ ఎర్రోళ్ల రమేష్ మాదిగ , వట్పల్లి మండల ఇన్చార్జ్ బురగల ప్రభాకర్ మాదిగ, పుల్కల్ మండలం ఇంచార్జ్ నడిమి దొడ్డి సాయికృష్ణ మాదిగ, మేతరి బాలరాజ్ మాదిగ, మునిపల్లి మండలం జంగం నవీన్ మాదిగ, కోఆర్డినేటర్ విజయ్ కుమార్ మాదిగ, రాయికోడ్ మండలం శ్రీకాంత్ మాదిగ లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంధ గల వీరయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాలోళ్ళ ప్రవీణ్ కుమార్, పుర్ర సంతోష్,పాపయ్య మాదిగ, యశ్వంత్ మాదిగ, ప్రసాద్ మాదిగ, నవీన్ మాదిగ, యేసయ్య మాదిగ, ఉషయ్య మాదిగ, బాలయ్య మాదిగ, చిన్నల్లి రాములు మాదిగ, అందోల్ నియోజకవర్గ మాదిగ కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బహుజన సమాజ్ పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం





**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 10**
సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మంజీరా హోటల్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నంపల్లి సుధీర్ సభ అధ్యక్షత వహించగా జిల్లా అధ్యక్షుడు రాష్ట్ర కమిటీ యొక్క సూచనలు పార్టీ నిర్మాణం లో సెక్టర్ కమిటీల నిర్మాణం పై లోతైన చర్చ చేయడం జరిగింది రానున్న రోజుల్లో సెక్టార్లు పూర్తిగా నిర్మాణం చేసే దిశగా జిల్లా కార్యవర్గ సభ్యులు అసెంబ్లీ నాయకులు ఒక నిర్ణయానికి రావడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ దావీద్ జిల్లా కార్యవర్గ సభ్యులు పి కృష్ణ సంగారెడ్డి అసెంబ్లీ ఇన్చార్జ్ యాదయ్య సంగారెడ్డి అసెంబ్లీ అధ్యక్షులు శ్రీధర్ నారాయణఖేడ్ అసెంబ్లీ అధ్యక్షులు తుకారం జహీరాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు ఎం సతీష్ సంగారెడ్డి అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి జార్జ్ పాల్గొనడం జరిగింది

## వర్షాలకోసం దావన్ పల్లిలో శ్రీరామ హృదయ కలశ యాత్ర...

### జాతీయస్థాయి అవార్డు గ్రహీత చెరుకు మహేశ్వర శర్మకు సర్పంచ్, గ్రామస్థుల ఘనసన్మానం భగవద్గీత ప్రదానం...





**రాయికల్ మండలం ఆగష్టు,10( రిపబ్లిక్ న్యూస్)**
శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం దావన్ పల్లిలో వికాస తరంగిణి, జాతీయవాది జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ బానావత్ తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో శ్రీరామ హృదయ కలశ యాత్రశ్రీరామ పాదయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకు మహేశ్వర శర్మ, వికాస తరంగిణి బాధ్యులు చిలుకమర్రి శ్యామసుందరాచారి శ్రీరామ కలశం, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటాన్ని సర్పంచ్ ప్రసాద్, ఉపసర్పంచ్ రవి నాయక్, శ్రీహనుమాన్ దీక్ష గురుస్వామి జగన్‌లకు అందజేశారు. గ్రామపంచాయతీ నుంచి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వరకు జై శ్రీరామ్ నినాదాలతో పాదయాత్ర నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యుల చేతుల మీదుగా జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వారి జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం అందుకున్న చెరుకు మహేశ్వర శర్మను సర్పంచ్ ప్రసాద్, గ్రామస్థులు, వికాస తరంగిణి బాధ్యులు, పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ ఘనంగా సన్మానించి భగవద్గీతను అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేశంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, లోకకల్యాణం, ధర్మస్థాపన, ధర్మపాలకుల రక్షణ జరగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంతోష్, బలరాం, రాజు నాయక్, గంగరాజం, కొమురయ్య, అంజనేయ స్వామి భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల త్యాగనిరతి తోనే బహుజన రాజ్యాధికారం సాధ్యం

**బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం**



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 10**
– బహుజన్ సమాజ్ పార్టీ కార్యకర్తల త్యాగనిరతి తోనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జి అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఈ రోజు అదిలాబాద్ జిల్లా అద్యక్షులు రత్నపురం రమేష్ అద్యక్షతన జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కమిటీలను సమీక్షించారు. ముందుగా బహుజన పితామహులైన మహాత్మా జ్యోతిబా పూలే, బాబాసాహేబ్ అంబేద్కర్, మాన్యవర్ కాన్షీరాం గారి చిత్రపటాలకు పూలతో నివాళులు అర్పించి అనంతరం కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. బహుజన పితామహులైన మహాత్మా జ్యోతిబా పూలే సావిత్రీబాయి పూలే త్యాగం , చత్రపతి సాహూజీ మహరాజ్ , బాబాసాహేబ్ అంబేద్కర్ త్యాగం వల్ల ఈ బహుజన ఉద్యమం నిలబడి ముందుకు సాగిందని ఆ తదనంతర కాలం లో మాన్యవర్ కాన్షీరాం గారి త్యాగం వల్ల బహుజన ఉద్యమం ఫలితాల వైపు సాగిందని మహానాయకులు ఆలోచించిన రాజ్యాధికారం సాధ్యమైందని , ఆ తరువాత బహుజన్ సమాజ్ పార్టీ అదినాయకురాలు బెహన్ జీ గారి త్యాగం వల్ల మాత్రమే ఈ ఉద్యమం నిలబడిందని అన్నారు. మనం కూడ ఈ త్యాగాలతో కూడిన నాయకత్వం ను స్ఫూర్తిగా తీసుకొని బెహన్ జీ గారి నాయకత్వం లో మనం త్యాగం నిజాయితీ నిబద్ధత తో కూడిన పని విధానం ద్వారా ప్రజలను రాజకీయ చైతన్యవంతం చేసి తద్వారా అమ్ముడు పోనీ సమాజం గా మార్చి సామ్రాట్ అశోకుడి కాలం నాటి సమతా సమాజం ను తీసుకువస్తమని కార్యకర్తలకు భరోసా కల్పించారు. ప్రస్తుత రాజకీయాల్లో ప్రజలను మతం పేరుతో కులం పేరుతో విడదీసి ప్రజలను మభ్యపెట్టి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బహుజనుల ఐక్యత , బహుజన కులాల్లో అమ్ముడు పోని స్వభావం ద్వార మాత్రమే బహుజనులకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని అన్నారు. అందుకోసం మనం బెహన్ జీ గారి నాయకత్వంలో పార్టీ ని బూత్ కమిటీ వరకు నిర్మించాలని అన్నారు. పార్టీ అంతర్గత నిర్మాణాలే ఉద్యమానికి పట్టుకొమ్మలని , బహుజన ఉద్యమం ద్వారా మాత్రమే ప్రజలు రాజకీయ చైతన్యం పొందుతారని ఆ చైతన్యం ద్వారా మాత్రమే అమ్ముడు పోని సమాజం ఆ సమాజ నిర్మాణం ద్వారనే బహుజన రాజ్యాధికారం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ కల్లెపెల్లి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు సంపంగి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కామిరే పోచెట్టి, అదిలాబాద్ అసెంబ్లీ అద్యక్షులు శ్రీహరి , బోథ్ అసెంబ్లీ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గోన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

### ఈ నెల 15న సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**సభాస్థలి, హెలిపాడ్ ను పరిశీలించిన జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్**



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 10**
ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి కి రానున్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి లో అధికారికంగా ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను, అంబేద్కర్ స్టేడియంలోని బహిరంగ సభ స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తో కలిసి పరిశీలించారు. అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అరకొరగా మాత్రమే రేషన్ కార్డులు అందాయని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా కోటి 5 లక్షల మందికి నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందించబోతున్నామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట కు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంగారెడ్డి గడ్డపై ఘన స్వాగతం పలుకుతామని జగ్గారెడ్డి తెలిపారు. సుమారు 50 వేల మంది జనసమీకరణతో ఈ బహిరంగ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## కార్మిక హక్కుల పరిరక్షణ కోసం హత్నూరలో రణభేరి!

**నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి**

**రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనం కల్పించాలి: సీఐటీయూ**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్)**
జైల్ భరో కార్యక్రమంలో భాగంగా దౌల్తాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ హత్నూర మండల నాయకులు కోనంపేట శేఖర్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, పెరుగుతున్న నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షబ్బీర్, మంగ, మహిపాల్, విజయతో పాటు వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# అవయవ దానంపై విస్తృత అవగాహన కల్పించాలి

**ఆర్గాన్ డొనేషన్ కేవలం వైద్య ప్రక్రియ కాదు.. మరణానంతరం మరొకరి జీవితంలో వెలుగులు నింపే మహోన్నత సేవ"**

**ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**







**నంద్యాల బ్యూరో, ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో అవయవ దానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, మరింత మంది అవయవ దానానికి ముందుకు వచ్చేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. పీజీఆర్ఎస్ హాల్ ముందు ఏర్పాటు చేసిన 'ఐ సపోర్ట్ ఆర్గాన్ డొనేషన్' సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ ఫొటో దిగి, అవయవ దానానికి అంగీకారం తెలుపుతూ దరఖాస్తును పూరించి రెడ్‌క్రాస్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించేందుకు ఏర్పాటు చేసిన అవగాహన సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "అవయవ దానం కేవలం ఒక వైద్య ప్రక్రియ కాదు.. మరణానంతరం కూడా మరొకరి జీవితానికి ఆశను అందించే మహోన్నత సేవ. ఒకరి అవయవ దానం మరొక కుటుంబంలో వెలుగులు నింపగలదు" అని అన్నారు. మరణానంతరం శరీరం మట్టిలో కలిసిపోయే బదులు, అవయవ దానం ద్వారా పలువురికి జీవనాన్ని అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒక వ్యక్తి అవయవ దానం ద్వారా ఎనిమిది మంది వరకు ప్రాణాలను కాపాడే అవకాశం ఉందనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. అవయవ దానంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ అంగీకార పత్రాన్ని పూరించి తమ పేరును నమోదు చేసుకోవడంతో పాటు, 'ఐ సపోర్ట్ ఆర్గాన్ డొనేషన్' సెల్ఫీ పాయింట్ వద్ద తమ మద్దతును తెలియజేయాలని కలెక్టర్ కోరారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు పీజీఆర్ఎస్ హాల్ వద్ద ప్రత్యేక సెల్ఫీ స్టాండ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పీజీఆర్ఎస్ హాల్‌లో రెడ్‌క్రాస్ రూపొందించిన అవయవ దాన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం అధికారులకు అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన లెక్చరర్ బి. సురేష్ కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవయవ దానానికి సంబంధించిన విధానం, ప్రాముఖ్యత, అపోహలు, అవయవ దాతలుగా నమోదు చేసుకునే ప్రక్రియ తదితర అంశాలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, జిల్లా అధికారులు, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**200 మందికి పైగా అవయవ దానానికి అంగీకారం**

అవయవ దానంపై నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిపి 200 మందికి పైగా అవయవ దానానికి అంగీకారం తెలుపుతూ నమోదు చేసుకున్నారు. అనంతరం వారు 'ఐ సపోర్ట్ ఆర్గాన్ డొనేషన్' సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగి అవయవ దానానికి తమ మద్దతును చాటుకున్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కూడా అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవయవ దానం ద్వారా సమాజానికి అందించగల సేవ, అవయవ దానంపై ఉన్న అపోహలు, దాతలుగా నమోదు చేసుకునే విధానం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు.

# ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం పెంపు

**రూ. 50,000 నుంచి రూ. 75,000 కు పెంచిన ప్రభుత్వం**

**న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**




**అమరావతి, ఆగస్టు10( రిపబ్లిక్ న్యూస్) :** రాష్ట్రం లోని ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం ను రూ.50,000 నుంచి రూ.75,000 కు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.రాష్ట్ర వ్యాప్తంగా 34 ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల కోర్టులు పని చేస్తున్నాయని తెలిపారు.2017 సంవత్సరం తర్వాత ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం పెంచలేదన్నారు. ఈ నేపథ్యంలో వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందని ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్లు చేసిన విన్నపాన్ని హైకోర్ట్ పరిశీలించి 34 కోర్టుల్లో పనిచేస్తున్న మేజిస్ట్రేట్ ల నెలసరి గౌరవ వేతనాన్ని పెంచేందుకు సిఫార్సు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రతిపాదనను పరిశీలించిన సియం చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ల నెలసరి గౌరవ వేతనాన్ని రూ. 50,000 ల నుండి 75,000 లకు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న రవాణా భత్యం (కన్వేయన్స్ అలవెన్సు) రూ. 10,000ను కొనసాగించుటకు కూడా ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ మేరకు గౌరవ వేతనం పెంపు, రవాణా భత్యం తో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా ఇటీవల సెకండ్ క్లాస్ స్పెషల్ మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం నెలకు రూ.30,000 నుండి రూ.45,000 కు పెంచిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. గౌరవ వేతనం పెంపు పట్ల ఫస్ట్ క్లాస్ స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్లు హర్షం వ్యక్తం చేశారు.

## నంద్యాల యూనిట్ లో పనిచేస్తున్న జయ శంకర్ అనారోగ్య సమస్యతో మృతి

**జిల్లా ఎస్పీ ఆదేశాలతో సంబంధిత అధికారుల పరామర్శ**

**అంత్యక్రియల నిమిత్తం 10,000/-కుటుంబానికి అందజేత**





**నంద్యాల క్రైం, ఆగస్టు 10, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల యూనిట్ నందు విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ డి.జయ శంకర్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్య కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడం జరిగింది. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడు 2004వ సంవత్సరంలో హోంగార్డుగా పోలీస్ శాఖలో నియామకం కావడం జరిగింది. ప్రస్తుతం నంద్యాల రూరల్ ఇన్స్పెక్టర్ వద్ద డ్రైవరు గా విధులు నిర్వహిస్తున్నాడు. హోంగార్డ్ చనిపోయిన వార్తా తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా సాయుధ బలగాల అదనపు ఎస్పీ చిన్నికృష్ణ, రిజర్వు ఇన్స్పెక్టర్ విజయ్ నరసింహ,సురేష్,హోంగార్డ్ ఇంచార్జి గోరెంట్ల, పోలీసు సిబ్బంది హోంగార్డ్ కుటుంబాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు.అనంతరం పోలీసు శాఖ తరుపున హోంగార్డ్ కుటుంబానికి అంత్య క్రియల ఖర్చుల నిమితం 10,000/-రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. పోలీస్ శాఖ తరపున డి.జయ శంకర్ కుటుంబానికి రావలసిన బెనిఫిట్స్ ను త్వరలో అందజేయడం జరుగుతుందని పోలీసు అధికారులు తెలియజేయడం జరిగింది.

## పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 121 ఫిర్యాదులు స్వీకరణ

**చట్ట పరిధిలో న్యాయం చేస్తామని ప్రజలకు భరోసా**

**ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**





**నంద్యాల క్రైం, ఆగస్టు 10, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ప్రజల నుంచి మొత్తం 121 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ నిర్వహించి, చట్ట పరిధిలో పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. చట్టపరంగా పరిష్కరించాల్సిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఒకే సమస్యపై ఫిర్యాదులు పునరావృతం కాకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి సకాలంలో నివేదించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు.

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా

# 'నేషన్ బిల్డింగ్‌లో భాగస్వాములు' కావాలి

**దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి**

**ఆగస్టు 10 నుంచి 15 వరకు జిల్లాలో విస్తృతంగా 'నేషన్ బిల్డింగ్' కార్యక్రమాలు**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 10 (రిపబ్లిక్ న్యూస్):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నేషన్ బిల్డింగ్‌లో భాగస్వాములు' (పేరెంట్స్ ఇన్ నేషన్ బిల్డింగ్) ప్రచార కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు ప్రజల భాగస్వామ్యంతో వివిధ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దేశ నిర్మాణం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను గుర్తించి చురుకుగా భాగస్వామి కావాలని పేర్కొన్నారు.

**హర్ ఘర్ తిరంగా.. ప్రతి ఇంటా జాతీయ పతాకం**

ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి ఇల్లు, వాణిజ్య సంస్థ, ప్రభుత్వ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల తరపున అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే జెండా ఎగురవేయడం కాకుండా, ప్రజలతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి వారిలో దేశభక్తి భావనను మరింతగా పెంపొందించాలని సూచించారు.

**ఆగస్టు 14న భారీగా మొక్కలు నాటే కార్యక్రమం**

ఆగస్టు 14న జిల్లావ్యాప్తంగా ఒకేరోజు విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో అటవీ, ఉద్యానవన శాఖల సహకారంతో ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లోని ప్రముఖ ప్రదేశాలు, ఇతర అనువైన ప్రాంతాలతో పాటు ప్రజలు తమ ఇళ్ల వద్ద కూడా మొక్కలు నాటేలా ప్రోత్సహించాలన్నారు. మొక్క నాటే సమయంలో జాతీయ పతాకాన్ని చేతబూని, దేశ నిర్మాణంలో తాము అందించదలచిన కృషిపై ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షిస్తూ, తమ లక్ష్యం, భవిష్యత్ దిశకు గుర్తుగా దాన్ని పెంచేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, సందేశాలను సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

**త్రివర్ణ కాంతులతో ప్రభుత్వ భవనాల అలంకరణ**

ఆగస్టు 14, 15 తేదీల్లో జిల్లాలోని ప్రభుత్వ భవనాలు, ప్రధాన ప్రదేశాలను జాతీయ పతాకంలోని మూడు రంగుల విద్యుత్ కాంతులతో అలంకరించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.

**పాఠశాలల్లో 'అనే నేను'.. భవిష్యత్‌పై విద్యార్థుల ప్రతిజ్ఞ**

ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల ద్వారా 'అనే నేను' కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో తాము ఏమి కావాలనుకుంటున్నారు, రాష్ట్రం, దేశ నిర్మాణంలో తాము ఎలాంటి పాత్ర పోషించాలనుకుంటున్నారు అనే అంశాలపై స్వయంగా ఆలోచించి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి విద్యార్థి ఒకే విధమైన ప్రతిజ్ఞను చేయకుండా, తన ఆసక్తి, లక్ష్యం, ఆలోచనలకు అనుగుణంగా దేశ నిర్మాణానికి తాను అందించదలచిన సేవను స్వయంగా పేర్కొనేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఉత్తమమైన, స్ఫూర్తిదాయకమైన ప్రతిజ్ఞలను ఎంపిక చేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రస్తావిస్తూ విద్యార్థులను ప్రోత్సహించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకోండి

**రీఓపెన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి -పీజీఆర్ఎస్‌లో 343 ప్రజా వినతులు స్వీకరణ -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, ఆగస్టు 10(రిపబ్లిక్ న్యూస్):** ప్రజల నుంచి అందుతున్న వినతులను సకాలంలో, నాణ్యతతో పరిష్కరించి ప్రజా సంతృప్తి పెంపొందించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి గణియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందుతున్న ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వానికి తావు లేకుండా ప్రతి అర్జీపై బాధ్యతతో స్పందించాలని అధికారులను ఆదేశించారు. రీఓపెన్ దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిష్కరించబడినట్లు తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్ దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ, ఆలస్యం కారణాలను సంబంధిత అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ దరఖాస్తులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. అటవీ శాఖకు సంబంధించిన ఒక దరఖాస్తు నిర్దేశిత సేవా గడువు (ఎస్ఎల్ఏ) దాటిన అంశంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. అలాగే అధికారుల లాగిన్‌లో ఇంకా పరిశీలించని దరఖాస్తులను పరిశీలించి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల ద్వారా అందుతున్న వినతులపైనా ప్రత్యేక దృష్టి సారించి, సత్వర పరిష్కారం అందించేలా చర్యలు తీ స ు కో వా ల ని ఆదేశించారు. అలాగే కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ కు సంబంధించిన వివరాలను వెంటనే నవీకరించాలని అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 165 దరఖాస్తుల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయిలోనే భూ సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 165 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. వాటిలో రెవెన్యూ, స్వర్ణ గ్రామ/వార్డులకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 15, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 11, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 30, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 57, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 45, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 4 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) మిడ్తూరు మండలం, అలగనూరు గ్రామానికి చెందిన పి. శ్రీనివాసులు గౌడ్ కు గ్రామ పరిధిలో సర్వే నెం.121/32సిలో 3 ఎకరాల పొలం కలదని, సదరు భూమిని ఆన్లైన్ లో నమోదు చేయించగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

2) కోవెలకుంట్ల మండలం, చింతకుంట గ్రామానికి చెందిన కొట్టం చిన్న రామన్నకు సర్వే నెం.132లో 1.78 ఎకరాల భూమి కలదని, సదరు భూమిని మ్యుటేషన్ చేయించి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.

3) ప్యాపిలి మండలం, మెట్టుపల్లి గ్రామానికి చెందిన ఆర్.సుధాకర్, ఆర్.తిరుపాలు అనే రైతులు మెట్టుపల్లి గ్రామానికి చెందిన సర్వే నెం.397 క్రింద 6 ఎకరాల పొలం కలదని, సదరు పొలంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి సర్వే జరిగిందని, ఆ పొలమే తమకు జీవనాధారం అని పొలంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com